ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కాకినాడ

జిల్లా వార్తలు

బుధవారం 9 జూలై 2025 | 5

ఎన్‌వోసీలు ఆపండి

- 'పక్కాగా స్కెచ్'పై ఆంధ్రజ్యోతి కథనం ఎఫెక్ట్
- ప్రత్తిపాడులో నలుగురు తహసీల్దార్లకు ఆదేశాలు
- ఉమ్మడి జిల్లాలో మైనింగ్ దరఖాస్తుదారులకు స్కెచ్‌ల విక్రయ బాగోతంపై కలెక్టర్ల ఆరా

7

జిల్లాలో వీఆర్వోల బదిలీలు

- గ్రేడ్ వన్ 21 మంది, గ్రేడ్ టూ 31 మందికి స్థానచలనం

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం పెద్దసంఖ్యలో వీఆర్వోలను బదిలీ చేస్తూ కలెక్టర్ షాన్ మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రేడ్-1 వీఆర్వోలు 21మందిని బదిలీ చేశారు. వీరిని జిల్లా పరిధిలో బదిలీ చేశారు. గ్రేడ్ టూ వీఆర్వోలు 29మందిని జిల్లా పరిధిలోనే బదిలీ చేశారు. మరో ఇద్దరిని ఇతర జిల్లాలకు బదిలీ చేశారు.

మట్టి మాఫియా బరితెగింపు!

- పెద్దాపురం మండలం పంగిడి చెరువులో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు
- పొలం మెరక చేసుకోవాలని రైతుల పేరుతో దరఖాస్తులు



7

- 10వేల క్యూబిక్ మీటర్లకు అనుమతి... తవ్వింది లక్షపైనే

ఐదు కుటుంబాలను దత్తత తీసుకున్న కలెక్టర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పీ4.. బంగారు కుటుంబం కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మార్గదర్శిగా ఐదు కుటుంబాలను దత్తత తీసుకున్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి పేద కుటుంబాలను దత్తత తీసుకోవాలన్న ఆదేశాలు వచ్చాయి.జిల్లాలో ఆర్థికంగా వెనుకబడిన వారిని బంగారు కుటుంబం పేరుతో గుర్తించి ఇప్పటికే జాబితా సిద్ధం చేశారు. వీరిలో ఐదు కుటుంబాలకు కలెక్టర్ మార్గదర్శిగా ఆర్థికావసరాల్లో అండగా నిలవనున్నారు. ఇందులో భాగంగా మంగళవారం కలెక్టర్ తాను దత్తత తీసుకున్న వారిలో మూడు కుటుంబాలను కలిశారు. పెద్దాపురం మండలంలోని వడ్లమూరులో దొండపాటి చార్లెస్ కుటుంబాన్ని, ప్రత్తిపాడు ఇందిరాకాలనీలో దివ్యాంగుడు మాదేరమణ కుటుంబాన్ని, కాత్రావులపల్లిలోని వితంతువు శాంతా నాగదుర్గ కుటుంబాన్ని పరామర్శించారు. వారి స్థితిగతులు తెలుసుకున్నారు. తాను ఆర్థికంగా అండగా ఉంటానని హామీఇచ్చారు.



ప్రత్తిపాడు ఇందిరాకాలనీలో తాను దత్తత తీసుకున్న రమణ కుటుంబంతో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్



టెన్షన్‌లోను..!

కార్పొరేషన్ రుణాలకు ఎదురుచూపులు

- రెండు నెలల కిందట నిలిపివేత
- 5,137 యూనిట్లు మంజూరు
- 45,765 దరఖాస్తులు రాక
- ఎమ్మెల్యేలపై తీవ్ర ఒత్తిడి
- సీఎం దృష్టికి సమస్య
- పెంపు యోచనలో నిలిపివేత
- రెండు నెలలైనా తేలని నిర్ణయం

(కాకినాడ,ఆంధ్రజ్యోతి) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బీసీ, ఎస్సీ కార్పొరేషన్ల ద్వారా ఇచ్చే స్వయం ఉపాధి రుణ యూనిట్లకు లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ తరహా రుణాలను ఐదేళ్ల పూర్తిగా నిలిపివేసింది. అయితే కూటమి ప్రభుత్వం రావడంతో కార్పొరేషన్ రుణాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో అంతా సంబరపడ్డారు. తీరా రుణాలు మంజూరైనట్టే అయి నిలిచిపోవడంతో అసలు వీటిని ఎప్పుడు తిరిగిస్తారో తెలియక పడిగాపులు కాస్తున్నారు .ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రుణాలకు వేలల్లో పోటీ నెలకొనగా.. యూనిట్లు వందల్లోనే ఉండడంతో ఎక్కడికక్కడ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలపై ఒత్తిడి తీవ్రమైంది. ఈ నేపథ్యంలో యూనిట్ల సంఖ్య మరింత పెంచాలని ప్రభుత్వాన్ని కోరడంతో తదుపరి నిర్ణయం కోసం రుణాలు మంజూరు చేయకుండా నిలిపివేశారు. ఇప్పటికే రెండు నెలలు దాటడంతో అసలెప్పుడు వీటిని ప్రభుత్వం మంజూరు చేస్తుందోనని అంతా ఆశగా ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 5,137 యూనిట్లు ప్రభుత్వం మంజూరు చేయగా.. అదే స్థాయిలో మళ్లీ కోటా పెంచవచ్చని భావిస్తున్నారు.

మంజూరు చేసిన యూనిట్లు ఇవే..

రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలల కిందట బీసీ, కాపు, ఎస్సీ, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ల కింద భారీగా స్వయం ఉపాధి యూనిట్లను ఉమ్మడి జిల్లాకు మంజూరు చేసింది. లబ్ధిదారుల ఎంపిక బాధ్యతను బీసీ, ఎస్సీ కార్పొరేషన్లకు అప్పగించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు 2,405 రుణ యూనిట్లను మంజూరు చేశారు. వీటి కింద ఫ్లవర్‌బొకేలు, వర్మీకంపోస్ట్ యూనిట్, వెబ్‌సైట్ డెవలప్‌మెంట్, ఎల్ఈడీ బల్బుల అసెంబ్లీ యూనిట్, ప్లంబింగ్, వాటర్ బాటిల్ రీసైక్లింగ్, వాటర్ రీసైక్లింగ్ యూనిట్లు, ఫిష్ ఫార్మింగ్, అడ్వెంచర్ టూరిజం, సబ్బులతయారీ, మొబైల్ కార్ వాష్, బేకరీ, ఫ్లైయాష్ బ్రిక్ యూనిట్, సెరికల్చర్, వెల్డింగ్, బ్యూటీ పార్లర్, మెడికల్ ల్యాబ్, మూడు చక్రాల ప్యాసింజర్ ఈ-ఆటో, నాలుగు చక్రాల ఆటో,కారు, గూడ్స్ ట్రక్‌వంటి వ్యాపారాలు చేసుకునేలా యూనిట్లు నిర్ణయించారు. ఆయా వ్యాపారాన్ని బట్టి ప్రభుత్వం 40 నుంచి 60 శాతం సబ్సిడీ, మిగిలింది బ్యాంకు రుణం, ఐదు శాతం వరకు లబ్ధిదారుడి వాటా కింద విభజించారు. ఈ మేరకు సామాజికవర్గాలవారీ దరఖాస్తులను ప్రభుత్వం ఆహ్వానించింది.

యూనిట్లు పెంచే యోచన..

ఐదేళ్ల తర్వాత మళ్లీ ఈ పథకం అమల్లోకి రావడంతో దరఖాస్తుదారులు వేలల్లో పోటెత్తారు. ఎంపికకాని వేలాదిమంది పేద యువత, నిరుద్యోగులు ఎమ్మెల్యేల వద్దకు క్యూకట్టారు. అటు ఎమ్మెల్యేల అనుచరులు సైతం అర్హత ఉన్న తమవారికి కూడా యూనిట్లు రాలేదని విన్నవించారు. దీంతో నియోజకవర్గాల్లో క్షేత్ర స్థాయి పరిస్థితులను ఎమ్మెల్యేలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. యూనిట్లు పెంచాల్సిన అవసరాన్ని వివరించారు. ఆ తర్వాత జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌ల్లోను జిల్లాల అధికారులు విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించారు. ప్రస్తుతం కేటాయించిన యూనిట్లు చాలా తక్కువగా ఉన్న నేపథ్యంలో వీటిని రెట్టింపు చేయాల్సిన అవసరం ఉందనే చర్చ ప్రభుత్వంలో జరిగింది. దీంతో ఇది వరకే ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను నిలిపివేయాలని అధికారులు నిర్ణయించారు. పెంచబోయే యూనిట్లను కలిపి అందరికే ఒకేసారి పథకం వర్తింపజేయాలని సమాచారం పంపించారు. అదనపు యూనిట్లు మంజూరు చేస్తామని రెండునెలలు దాటుతున్నా ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో అప్పటికే ఎంపికైన లబ్ధిదారులు, కొత్త యూనిట్లు వస్తాయని ఆశతో ఉన్న వారు నిరీక్షిస్తూ కూర్చున్నారు. అసలు వీటిని ఎప్పుడు విడుదల చేస్తారంటూ జిల్లాల్లో ఆయా శాఖల అధికారులను అదే పనిగా సంప్రదిస్తున్నారు. అయితే యూనిట్ల పెంపు ఖాయమని, అది ఎప్పుడనేది తమకు కూడా సమాచారం లేదని జవాబు ఇస్తున్నారు.ప్రభుత్వం మాత్రం నియోజకవర్గాల వారీగా ఆయా సామాజికవర్గ అవసరాలను బట్టి త్వరలో కోటా నిర్ధారించి యూనిట్ల సంఖ్యను పెంచేందుకు కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. ఎమ్మెల్యేల తరపున కోటా కాకుండా ఎక్కువమంది సామాన్య యువతకు యూనిట్లు అందేలా సంఖ్యను నిర్ధారించి త్వరలో ప్రకటించనున్నట్టు అధికారులు చెబుతున్నారు.

గత ఐదేళ్లూ.. రుణ ఊసేలేదు..

గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఈ రెండు కార్పొరేషన్లను అటకెక్కించేసింది.నిరుద్యోగులకు రుణ సదుపాయం కల్పించకుండా వారిని ఇబ్బంది పెట్టింది.2019నాటికి మునుపటి టీడీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు పంచడానికి సిద్ధంగా ఉన్న రుణాలు, పనిముట్లను సైతం మూలనపారేసింది. ఒకరకంగా చెప్పాలంటే ఐదేళ్లపాటు ఈ కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేయకుండా నిరుద్యోగులను ఇబ్బంది పెట్టింది. ప్రభుత్వం మారాక సీఎం చంద్రబాబు ఆదేశాలతో మళ్లీ బీసీ,కాపు, ఎస్సీ,ఈడబ్ల్యూఎస్ వర్గాలకు స్వయం ఉపాధి యూనిట్లను మంజూరు చేయాలని అధికారులు నిర్ణయించారు.



వేలల్లో దరఖాస్తులు

యూనిట్లు వందల్లో ఉంటే దరఖాస్తుదారులు వేలల్లో వచ్చారు. ప్రధానంగా బీసీ కార్పొరేషన్ రుణాల కింద కాకినాడ జిల్లాకు రూ.39.52 కోట్ల విలువైన 1,914 యూనిట్లు మంజూరు చేస్తే ఏకంగా 31,859 మంది, తూర్పుగోదావరి జిల్లాలో రూ.28.87 కోట్ల విలువైన 1,374 యూనిట్లకు 16,408 మంది, కోనసీమ జిల్లాలో రూ.29.54 కోట్ల విలువైన 1,394 యూనిట్లకు 15,147 మంది పోటీపడ్డారు. కాపు కార్పొరేషన్ కింద కాకినాడలో రూ.28.24 కోట్ల విలువైన 763 యూనిట్లకు 21,454 దరఖాస్తులు, తూర్పుగోదావరి జిల్లాలో రూ.27.15 కోట్ల విలువైన 757 యూనిట్లకు 8,193 మంది, కోన సీమ జిల్లాలో రూ.27.14 కోట్ల విలువైన 757 యూనిట్లకు 15,644 మంది పోటీపడ్డారు. ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ కింద ఉమ్మడి జిల్లాకు రూ.14 కోట్ల విలువైన 511 యూనిట్లు మంజూరు చేయగా 6 వేల మంది దరఖాస్తులు చేశారు. ఎస్సీ కార్పొరేషన్ కింద కాకినాడ జిల్లాకు 798 యూనిట్లు మంజూరవగా 5,497, కోనసీమ జిల్లాకు 1,043 యూనిట్లకు 3,265 మంది,తూర్పుగోదావరి జిల్లాలో 891 యూనిట్లకు 4,555 మంది దరఖాస్తులు చేశారు.

పీ-4కు సర్వం సిద్ధం



పెద్దాపురం మండలం వడ్లమూరులో దత్తత తీసుకున్న చార్లెస్ కుటుంబంతో మాట్లాడుతున్న కలెక్టర్

- కొలిక్కి వచ్చిన అర్హుల సర్వే
- జిల్లాలో 1.02లక్షల బంగారు కుటుంబాల గుర్తింపు
- మార్గదర్శకులకు అనుసంధానం చేసే దిశగా చర్యలు
- ఆగస్టునుంచి పూర్తిస్థాయిలో అమలు
- ప్రత్యేక అధికారుల నియామకం

కార్పొరేషన్(కాకినాడ), జూలై 8(ఆంధ్రజ్యోతి): పేదరికంలో ఉన్న కుటుంబాలను ఆర్థికంగా పైకి తేవడానికి పేదవాడిని పైకి తెద్దాం ప్రణాళిక ద్వారా పేదరిక నిర్మూలన, సమాజ అభివృద్ధికి మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం అందించేందుకు లక్ష్యంగా పెట్టుకుని సీఎం చంద్రబాబు పీ-4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించి దాతల సహకారంతోపాటు ప్రభుత్వం వైపు నుంచి కూడా అన్ని విధాలుగా ఊతమిచ్చి పీ-4ను అమలు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా జిల్లాలో పీ-4కు అర్హత కలిగిన బంగారు కుటుంబాల జాబితాను ఇప్పటికే సిద్ధం చేశారు. మార్గదర్శకుల జాబితా కూడా దాదాపు సిద్ధమైంది. పీ-4 అమలు పర్యవేక్షణకు మండలాల వారీగా ప్రత్యేక అధికారుల నియామకం కూడా జరిగింది. పీ-4 అమలు తీరు తెన్నులకు సంబంధించి తాజాగా అన్ని విభాగాల అధికారులతో సమావేశమైన కలెక్టర్ షాన్‌మోహన్ ఆగస్టు నెల నుంచి అమలు చేసేలా కసరత్తు చేస్తున్నారు. పేదరికం లేని సమాజ సాధనకు రాష్ట్ర ప్రభుత్వం సదాశయంతో చేపట్టిన పీ4 కార్యక్రమం ద్వారా గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వ ఉద్యోగులు మార్గదర్శకులుగా బంగారు కుటుంబాలను దత్తత స్వీకరించి ఆదర్శంగా నిలవనున్నారు.

15 అంశాలతో ప్రణాళిక సిద్ధం

ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలతోపాటు ప్రజలను భాగస్వాములను చేసి ప్రతి ఇంటికి అభివృద్ధి, ప్రతి జీవితానికి ప్రగతి, మౌలిక ఆశయంతో ప్రభుత్వ ఆశయాన్ని, లక్ష్యాన్ని సాకారం చేయడంలో ప్రభుత్వ ఉద్యోగులు ముందుకు వచ్చి మిగిలిన వారందరికీ ఆదర్శంగా నిలిచారు. ఇందుకనుగుణంగా జిల్లాలోని గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు ప్రభుత్వ అధికారులు, సిబ్బంది మార్గదర్శకులుగా బంగారు కుటుంబాలకు అండగా నిలవనున్నారు. గ్రామస్థాయి ఉద్యోగి ఒక కుటుంబాన్ని, మండల స్థాయి ఉద్యోగి రెండు, డివిజన్, జిల్లాస్థాయిలో సెంకడ్ ఇన్ ర్యాంకు ఉద్యోగులు మూడు కుటుంబాలను, జిల్లా అధికారులు ఐదు బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని కలెక్టర్ సూచనల మేరకు ప్రణాళికాబద్ధంగా అంతా సిద్ధం చేశారు. బంగారు కుటుంబాల జీవన స్థాయి పెంచేందుకు 15అంశాలతో కూడిన జాబితా రూపొందించారు. ఉద్యోగులు ఎంచుకున్న బంగారు కుటుంబాలను మార్గదర్శులు కలుసుకుని వారి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషిచేయనున్నారు.

జిల్లాలో పూర్తయిన సర్వే

జిల్లాలో చేపట్టిన పీ4 సర్వేలో అధికారులు లక్షా2వేల కుటుంబాలను కడు పేదరికంలో ఉన్నట్లు గుర్తించారు. వీరందరినీ బంగారు కుటుంబాల జాబితాలో చేర్చి పీ4 అమలుపై దృష్టిసారించారు. జిల్లాలో వివిధ విభాగాలకు చెందిన జిల్లా అధికారులను కూడా మార్గదర్శకుల జాబితాలో చేర్చి ఆ కుటుంబాలకు ప్రభుత్వ పథకాలను అందేలా వారు చర్యలు తీసుకునేలా కార్యాచరణ రూపొందించారు. వీటితోపాటు బంగారు కుటుంబాలతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి వారిని స్వయం సాధికారిత వైపు నడిపించనున్నారు. బ్యాంకుల నుంచి రుణ సదుపాయాలతోపాటు మహిళలకు ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణలు ఇచ్చేలా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. దీంతో పీ4 ద్వారా పేదల జీవితాల్లో కొత్త వెలుగులు రానున్నాయి. పీ4 కార్యక్రమంలో జిల్లా ముందుండాలని కలెక్టర్ అధికారులకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారు.

నేతల పాత్రే కీలకం

పీ4 విజయవంతం కావాలంటే ప్రధానంగా నేతల సహకారమే కావాల్సి ఉంది. ఆయా నియోజకవర్గాల పరిధిలోని గ్రామాల్లో ఆర్థికంగా బలంగా ఉండి సొసైటీకి కొంతైనా తిరిగివ్వాలనే భావన ఉన్నవారెవరో సహజంగా నేతలకే తెలిసి ఉండే అవకాశమే ఎక్కువగా ఉంది. వీరిని మార్గదర్శకులుగా మార్చడంలో నేతల పాత్రే కీలకం కానుంది. పీ4 అమలును ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో అమలు పురోగతిపై ఇటీవలే కలెక్టర్ షాన్‌మోహన్ అన్ని విభాగాల అధికారులతో పూర్తిస్థాయి సమీక్ష జరిపారు.

పెట్టుబడులు రాకుండా జగన్ కుట్రలు

- సమాచార, గృహ నిర్మాణ శాఖా మంత్రి పార్థసారథి
- తునిలో ఎమ్మెల్యే దివ్యతో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి



తునిలో ఎమ్మెల్యే దివ్యతో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి పార్థసారథి

7

గోదావరి కళాక్షేత్రం పేరు యథాతథం

కార్పొరేషన్(కాకినాడ), జూలై 8(ఆంధ్ర జ్యోతి): కాకినాడ స్మార్ట్ సిటీలో భాగంగా నిర్మించిన గోదావరి కళాక్షేత్రం పేరును యథాతథంగా ఉంచుతూ కలెక్టర్ ఆమోదం తెలిపారు. గత వైసీపీ హయంలో దీనికి శ్రీరాగిరెడ్డి వెంకట జయరామ్‌కుమార్ కళాక్షేత్రంగా పేరు మార్చారు. దీనిపై కాకినాడ నగర ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు పూర్వాపరాలను కార్పొరేషన్ కమిషనర్ భావన పరిశీలించారు. స్మార్ట్‌సిటీ ప్రాజెక్ట్ నిధులతో నిర్మించిన ఆడిటోరియంగా ఇది మున్సిపల్ కార్పొరేషన్ రికార్డుల్లో నమోదై ఉంది. దీంతో కళాక్షేత్రానికి గోదావరి కళాక్షేత్రంగా పాత పేరును ఉంచాలని ప్రతిపాదించిన తీర్మానానికి నగర ప్రత్యేకాధికారి, జిల్లా కలెక్టర్ మంగళవారం ఆమోదం తెలిపి ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యాసంస్థల సమీపంలో..
పాన్‌షాపుల్లో పోలీసుల తనిఖీలు

- పొగాకు ఉత్పత్తులు స్వాధీనం.. ధ్వంసం
- కోప్టా యాక్ట్ కింద పలువురికి జరిమానా



ఖైనీ, గుట్కా, ప్యాకెట్లను ధ్వంసం చేస్తున్న పోలీసులు

కాకినాడ క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే చర్యలు తప్పవని కాకినాడ ఎస్‌డీపీవో పాటిల్ దేవరాజ్‌మనీష్ హెచ్చరించారు. ఐజీ ఈగల్ టీమ్ ఆదేశాల మేరకు ఎస్పీ జి.బిందుమాధవ్ పర్యవేక్షణలో ఎస్‌డీపీవో ఆధ్వర్యంలో మంగళవారం కాకినాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న కాలేజీలు, హస్టళ్లు, పాఠశాలలకు 100 మీటర్ల పరిధిలో ఉన్న పాన్‌షాపులపై సీఐ ఎం.నాగదుర్గారావు బృందం దాడులు చేశారు. పొగాకు ఉత్పత్తులకు సంబంధించిన ఖైనీ, గుట్కా, తంబాకు, సిగరెట్లు విక్రయిస్తున్న 15 షాపుల్లో తనిఖీలు చేసి కోప్టా యాక్ట్ ప్రకారం జరిమానా విధించి వారి నుంచి రూ.15వేల విలువైన పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని సరుకును ధ్వంసం చేశారు. కాకినాడ త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్న 10 పాన్‌షాపులపై దాడులు నిర్వహించి ఖైనీ, గుట్కా, తంబాకు, సిగరెట్లను స్వాధీనం చేసుకుని షాపుల నిర్వాహకులకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు సీఐ కేవీవీ సత్యనారాయణ తెలిపారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు మేరకు జిల్లావ్యాప్తంగా కూడా పలుచోట్ల పాన్‌షాపుల్లో ఈ తనిఖీలు నిర్వహించారు.

పదవుల పండుగ

- జిల్లాలో 34 సొసైటీలకు చైర్‌పర్సన్‌ల నియామకం
- ఎన్నికల్లో కూటమి గెలుపునకు కృషి చేసినవారికి ప్రాధాన్యం

కాకినాడ, జూలై 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, విశాల సహకార సంఘాల చైర్‌పర్సన్లను, సభ్యులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం రాత్రి ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ పదవీకాలం తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఉంటుందని ఎక్స్‌అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాకినాడ జిల్లాకు సంబంధించి 34, తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి 22, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి 53 సొసైటీలకు చైర్‌పర్సన్లను, సభ్యులను నియమించారు. కూటమిలో భాగంగా టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన గ్రామస్థాయి నేతలకు ఈ పదవులు కేటాయించారు. గతేడాది ఎన్నికల్లో భాగంగా కూటమి గెలుపు కోసం కృషి చేసినవారిని గుర్తించి పదవులకు ఎంపిక చేశారని సమాచారం. జిల్లాలోని మొత్తం 34 సంఘాలకు సంబంధించి నియమితులైన వారి వివరాలు ఇలా..

సొసైటీ	చైర్మన్
అర్యవటం	కోటా తాతబ్బాయి
దుగ్గుదూరు	యాళ్ల తానిబాబు
గొల్లపాలెం	అంగర కృష్ణ
జగన్నాథగిరి	కొండమూరిసత్యనారాయణ
కాజులూరు	యాళ్ల వెంకటరమణ
పెనుమళ్ల	కొల్లు వెంకటేశ్వరరావు
తణుకువాడ	పితాని సతీష్‌కుమార్
మంజేరు	గండి ధనరాజు
పల్లిపాలెం	కాలా నరసింహమూర్తి
పండూరు	చిలుకూరి రామ్‌కుమార్
సర్పవరం	కటకంశెట్టి బాబి
కరప	ఎస్.భవానీశంకర్
కూరాడ	వెలుగుబంట్ల సూరిబాబు
పెనుగుదురు	రెడ్డిపల్లి నారాయణరావు
వేములవాడ	దూడల నారాయుడు
జెడ్ భావారం	గంటా వీరన్న చౌదరి
పీబీ దేవం	తోటకూర రాజ్‌కుమార్

సొసైటీ	చైర్మన్
వీకే రాయపురం	కె.నారాయణస్వామి
గండేపల్లి	కంటిపూడి సత్యనారాయణ
మల్లేపల్లి	దిడ్డి వెంకటరాజు
మురారి	చావా తమ్మన్న చౌదరి
ఉప్పలపాడు	తమటం నాగేంద్ర
నాయకంపల్లి	పాలకుర్తి ఆదినారాయణ
జెడ్ రాగంపేట	కందుల కొండయ్య చౌదరి
కట్టమూరు	ఏలేటి సుబ్బారావు
జగ్గంపేట	బుర్రి సత్యనారాయణ
రాజపూడి	ఉప్పలపాటి వెంకటేశ్వరరావు
వేమవరం	తోట సతీష్‌కుమార్
కిర్లంపూడి	కుర్ల వెంకటరమణమూర్తి
ధర్మవరం	దాసం శేషారావు
లింగంపర్తి	పెంటకోట మోహన్
కోటనందూరు	పెనుమచ్చి నాగేశ్వరరావు
రౌతులపూడి	పైలా పైడిరాజు
ఎస్.ఎన్ పట్నం	పేరూరి చినకృష్ణయ్య

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

- డీపీవో రవికుమార్



కొరుపల్లిలో పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీపీవో రవికుమార్

కరప, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని కొరుపల్లిలో పర్యటించి ఇళ్ల నుంచి తడిచెత్త-పొడిచెత్త సేకరణను పరిశీలించారు. తాగునీటి సరఫరాను పరిశీలించి క్లోరినేషన్ పరీక్షలు నిర్వహించి సిబ్బందికి సూచనలు జారీ చేశారు. చెత్త నుంచి సంపద తయారీకేంద్రం పనితీరుపై సమీక్షించారు. ఎంపీడీవో మట్టపర్తి అనుపమ, డిప్యూటీ ఎంపీడీవో సలాది శ్రీనివాసరావు, సర్పంచ్ పలివెల నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి పి.లక్ష్మీనారాయణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఎస్.రాజా తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం రాముడి భూములపై వివాదం

- ఎటపాక మండలం పురుషోత్తపట్నం రామాలయ భూముల్లో ఉద్రిక్తత, దాడి
- ఇంటి నిర్మాణదారులు, దేవస్థానం అధికారుల మధ్య తోపులాట
- స్పృహ కోల్పోయిన దేవస్థానం ఈవో రమాదేవి

మెయిన్‌లో..





సెల్..రేగితే.. చెరసాలే!

చేతిలో సెల్‌ఫోన్ ఉంది. సోషల్ మీడియాలో 'సెల్'రేగిపోదాం.. ఫేస్‌బుక్, వాట్సాప్, ఎక్స్, ఇన్‌స్టాలో రెచ్చిపోదాం. అసభ్యకర, అసత్య పోస్టులు పెడుతూ అలజడి రేపుదాం అనుకునే వారికి షాక్ ఇస్తున్నారు కాకినాడ జిల్లా పోలీసులు. ఇష్టానుసారంగా తప్పుడు సందేశాలను, సంకేతాలను ప్రజల మధ్యకు పంపుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని కటకటాల వెనక్కి నెడుతున్నారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడేలా, ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, మహిళలను కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ.. ప్రచార పైశాచికానందాన్ని పొందుతున్న వారి సరదా తీర్చేస్తున్నారు. ఇటీవల జరిగిన అరెస్టులే ఓ హెచ్చరిక అనుకోవాలని వార్నింగ్ ఇస్తున్నారు.

- సోషల్ మీడియాలో రాంగ్ పోస్టులు వద్దు
- అసభ్యకర, అసత్యప్రచారాలు చేస్తే ఊరుకోం
- పోస్టులు పెట్టే ముందు ఆలోచించండి
- తప్పుడు పోస్ట్ ఫార్వర్డ్ చేసి ప్రమాదంలో పడొద్దు
- అడ్మిన్లూ.. రాంగ్ పోస్టుల బాధ్యత మీదే..
- కాకినాడ జిల్లా పోలీసుల హెచ్చరిక.. విస్తృత ప్రచారం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

విశాఖలో జూన్ 21న జరిగిన ప్రపంచ యోగా దినోత్సవం-2025 కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి పాల్గొన్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కించపరిచేలా సోషల్ మీడియా ప్లాట్‌ఫాం 'ఎక్స్' వేదికగా, అవమానకరంగా పోస్టును విడుదల చేసి దాన్ని షేర్ చేసిన ఘటనపై పిఠాపురం టౌన్ పోలీస్ స్టేషన్‌లో జనసైనికులు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను అవమానపరుస్తూ సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా అవమానకరంగా పోస్టు పెట్టిన ఈ కేసుపై కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ సీరియస్‌గా తీసుకున్నారు. ఆ పోస్టులు ఎవరు పెట్టారు? వారి ఆచూకీ కోసం ప్రత్యేక పోలీసు బృందాలను నియమించి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు పంపారు. దీనిలో భాగంగా జూన్ 24న వివిధ ప్రాంతాలకు చెందిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. వీరిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలంలోని ఎస్.యానం ప్రాంతానికి చెందిన కర్రి వెంకటసాయి వర్మ (ఏ2), మచిలీపట్నం మండలం వలందపాలెం గ్రామానికి చెందిన పాముల రామాంజనేయులు(ఏ3), హైదరాబాద్ సరూర్‌నగర్ సింగరేణి కాలనీకి చెందిన షేక్ మెహబూబ్(ఏ4) ఉన్నారు. ఇదే కాదు.. ఇలాంటి సంఘటనలు ఉమ్మడి జిల్లా పరిధిలో మరెన్నో జరుగుతున్నాయి.



వాయు వేగాన్ని మించి..

'నిజం గుమ్మం దాటే లోపు.. అబద్ధం ఊరంతా చుట్టేసి వస్తుందన్న' చందంగా ఉంది సోషల్ మీడియా తీరు. మంచి విషయాలు పక్కన పెడితే.. అసత్య ప్రచారాలు అధికంగా కనిపిస్తున్నాయి. సోషల్ మీడియా నేడు ఒకరిపై ఒకరు దుమ్మెత్తుకొని పోసుకునే ఆయుధంగా మారింది. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకునేందుకు వీలుగా తయారైంది. ఒకరు పోస్టు పెట్టడం, దానికి మరొకరు కౌంటర్‌గా కామెంట్ చేయడం, దాన్ని మరి కొందరు లైక్ చేయడం, షేర్ చేయడం, ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టా, ఎక్స్.. ఇలా అన్ని ప్లాట్‌ఫాంలలోనే హల్‌చల్ చేయడం, వివాదాలకు దారి తీయడం ఇలా వ్యవహారం నడుస్తోంది. ఎక్కడైనా చిన్న సంఘటన జరిగితే చాలు వెంటనే వీడియో/ఫొటో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడం నేడు కొందరికీ అలవాటుగా మారింది. అసలు అందులో వాస్తవమెంత? ఎవరు తీశారు? ఇది షేర్ చేయడం వల్ల ఇబ్బందులేమైనా ఎదురవుతాయా? అనే విషయాలను ఆలోచించకుండానే కొందరు అసభ్యకర, అవమానకర పోస్టులను షేర్ చేసి ఇబ్బందులు తెచ్చుకుంటున్నారు.

సమస్యలు తెచ్చుకోవద్దు

కాకినాడ జిల్లా ప్రజలకు ముఖ్య విజ్ఞప్తి. సోషల్ మీడియాను ఇష్టారీతిన వాడి సమస్యలు కొని తెచ్చుకోవద్దు. సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టే ముందు జాగ్రత్త వహించాలి. నిర్ధారించుకోకుండా ఏమెసేజ్ ఫార్వర్డ్ చేయొద్దు. తప్పుడు వార్తలు ప్రచారం చేస్తే జైలుకు వెళ్తారు. తప్పుదోవ పట్టించే ఫొటోలు, వీడియోల జోలికి వెళ్లొద్దు. నిజనిర్ధారణ లేకుండా పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవు.

- బిందుమాధవ్, ఎస్పీ, కాకినాడ జిల్లా

షేర్ చేసినా నేరమే..

సోషల్ మీడియాలో అనుచితమైన సందేశాలను పోస్టు చేయడమే కాదు.. షేర్ చేసినా తీవ్ర తప్పిదంగా పరిగణిస్తున్నారు. పోస్టు చేసిన వ్యక్తితోపాటు.. ఆ పోస్టు షేర్ చేసిన వారి సోషల్ మీడియా ఐడీలను గుర్తిస్తున్నారు. మెసేజ్ మొదట ఎక్కడినుంచి వచ్చింది? దాన్ని ఎవరెవరు షేర్ చేశారు? ఏ వాట్సాప్ గ్రూపులో తిరుగుతోంది? దాని అడ్మిన్ ఎవరు? ఎందుకు పోస్టు చేశారు? ఇలా రకరకాలుగా ఆరా తీస్తున్నారు. సిస్టమ్ ఐపీ నెంబర్ ఆధారంగా ఏ కంప్యూటర్ లేదా ఏ మొబైల్ నుంచి ఆ మెసేజ్ బయటకు వచ్చింది.. వంటి విషయాలను ప్రత్యేక ఐటీ నిపుణులతో క్షుణ్ణంగా పరిశీలించి సోషల్ మీడియాలో పైశాచిక ఆనందం పొందుతున్న వారిని అదుపులోకి తీసుకుంటున్నారు. కటకటాల వెనక్కి నెడుతున్నారు. జిల్లాలోని సోషల్ మీడియాను ప్రభావితం చేసేలా రెగ్యులర్ పోస్టింగ్‌లు చేస్తున్న వారిపైనా ప్రత్యేక నిఘా పెడుతున్నారు. గ్రూప్ అడ్మిన్‌లు ఎవరు? వారి నేపథ్యమేంటి? క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

ఐటీ చట్టాల ప్రకారం శిక్షలు..



ముఖ్యంగా ఎదుటి వారి వ్యక్తిగత విషయాలు, జీవితాలు, వారిని కించపరుస్తూ, అసభ్యపదజాలంతో దూషిస్తూ, అవమానకరంగా చిత్రీకరిస్తూ, వారి వ్యక్తిగత స్వేచ్ఛను హరిస్తూ ప్రవర్తిస్తే 66డీ ఐటీ యాక్ట్, 67ఏ ఐటీ యాక్ట్, 66ఈ ఐటీ యాక్ట్‌ల ప్రకారం పోలీసులు కేసులు నమోదు చేస్తారు.

- 66డీ ఐటీ యాక్ట్ : కంప్యూటర్‌ను ఉపయోగించి డిజిటల్ మార్గాల ద్వారా ఎవరినైనా మోసం చేస్తే ఈ చట్టం ద్వారా పోలీసులు అరెస్టు చేస్తారు. ఉదాహరణకు నకిలీ సోషల్ మీడియా ప్రొఫైల్‌ను సృష్టించడం, ఆన్‌లైన్ ఖాతాల ద్వారా అనధికార మోసాలకు పాల్పడితే ఈ సెక్షన్ వర్తింపజేస్తారు. మూడేళ్ల జైలు శిక్ష విధిస్తారు.
- 67(ఏ) ఐటీ యాక్ట్ : సెల్‌ఫోన్లలో అసభ్యకరమైన వీడియో సందేశాలు పోస్టు చేస్తే తీవ్రమైన నేరంగా ఈ యాక్ట్‌లో పరిగణిస్తారు. ఇందులో ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10లక్షల వరకు జరిమానా విధిస్తారు.
- 66ఈ ఐటీ యాక్ట్ : ఎవరినైనా ఉద్దేశపూర్వకంగా, వారి అనుమతి లేకుండా వారి ఫొటోలను అసభ్యకరంగా చిత్రీకరించి అవమానకరంగా పోస్టులు పెట్టిన వారిపై ఈ సెక్షన్ ద్వారా చర్యలు తీసుకుంటారు. జైలు శిక్ష, జరిమానా రెండూ ఉంటాయి.



ముచ్చటగా ముగ్గురు!

ముగ్గురు విద్యార్థులు... ఒక టీచరు... ఈ చిత్రంలో కనిపిస్తున్నది అదే... కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం కొత్తపల్లి స్పెషల్ మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుత పరిస్థితి ఇదీ... ఇక్కడ గతంలో వందలాది మంది విద్యార్థులు చదువుకున్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు సుమారు 200-250 మంది విద్యార్థులకు ఐదుగురు ఉపాధ్యాయులు ఉండేవారు. టీచర్లు కొత్తపల్లి మండలం బదిలీ కోరుకొంటే ఈ పాఠశాలలో పని చేసేందుకు సుముఖత వ్యక్తం చేసేవారు. కానీ ఇప్పుడా పరిస్థితి తారుమారైంది. ఒకటో తరగతిలో ముగ్గురే పిల్లలుండగా ఒక ఉపాధ్యాయురాలు మాత్రమే ఉన్నారు.

- కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి)

'ప్రసాద్' పథకంలో అన్నవరం ఆలయ అభివృద్ధి

కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 8 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, వారసత్వ ప్రదేశాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ పథకం అమలు చేస్తోంది. దీనిద్వారా కాకినాడ జిల్లాలోని అన్నవరం సత్యనారాయణస్వామి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం అభినందనీయమని కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ నిధులతో ఆలయ పరిసరాల్లో చేపట్టనున్న పనులకు సంబంధించిన టెండర్లను వచ్చే వారం ఖరారు చేయనున్నారని చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ టెంపుల్ టూరిజంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఈ విషయాన్ని ఎంపీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.



డొక్కా సీతమ్మ విగ్రహం వద్ద ఆమె బంధువులు

డొక్కా సీతమ్మ విగ్రహ సందర్శన

సర్పవరం జంక్షన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్‌లో తెలుగు ఉపాధ్యాయురాలు ముత్య వెంకటరామలక్ష్మి ఏర్పాటుచేసిన డొక్కా సీతమ్మ విగ్రహాన్ని మంగళవారం ఆమె బంధువులు సందర్శించారు. అందులో ఒకరైన నరసింహమూర్తి మాట్లాడుతూ ఆంధ్రుల అన్నపూర్ణగా పేర్గాంచిన సీతమ్మ సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విగ్రహ దాత రామలక్ష్మి, హెచ్‌ఎం గాయత్రి, ఇన్‌చార్జి పి.శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

నోరు అదుపులో పెట్టుకోకుంటే తీవ్ర పరిణామాలు



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నేతలు తుమ్మల, పంతం

- గంజాయికి కేరాఫ్ దాడిశెట్టి రాజా
- సీటు కోసం పవన్ చుట్టూ జక్కంపూడి ప్రదక్షిణలు
- జనసేన నేతలు తుమ్మల, పంతం

పిఠాపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవల్సి ఉంటుందని డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ హెచ్చరించారు. కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, వేగుళ్ల లీలాకృష్ణలతో కలిసి మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైసీపీ నేతల వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. ఓడిపోయి పనిలేకుండా ఉన్న మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను ఇక్కడకు పంపించి అవాకులు, చవాకులు మాట్లాడిస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ నాయకులు జక్కంపూడి రాజా, దాడిశెట్టి రాజా.. జగన్ వద్ద మార్కులు కోసం వారు ఇచ్చిన స్క్రిప్ట్ చదివారని విమర్శించారు. తునిలో దాడిశెట్టి గంజాయికి కేరాఫ్ అడ్రస్‌గా మారారని ఆరోపించారు. గతంలో సీటు కోసం పవన్‌కల్యాణ్ కార్యాలయం చుట్టూ తిరిగిన రోజులను జక్కంపూడి మర్చిపోయినట్టున్నారని ఎద్దేవా చేశారు. రాజకీయాల్లో నిస్వార్థంగా ప్రజలు కోసం పనిచేస్తున్న వ్యక్తి పవన్‌కల్యాణ్ అని అన్నారు. ఎమ్మెల్యే అయిన ఏడాదిలోనే పిఠాపురం నియోజకవర్గాన్ని రూ.1000 కోట్లతో అభివృద్ధి చేశారని చెప్పారు. పిఠాపురం నియోజకవర్గంలో పవన్ చేసిన అభివృద్ధిపై అవాకులు చవాకులు మాట్లాడిన వైసీపీ నేతలు చర్చకు రావాలని వారు సవాల్ చేశారు. సమావేశంలో గోదావరి ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, ఏలేరు ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఊటా నానిబాబు, జనసేన మహిళా విభాగం కో-ఆర్డినేటర్ చల్లా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో 9 మందికి కారుణ్య ఉద్యోగాలు



ఉద్యోగ నియామకాలు పొందిన వారితో ఆర్టీసీ అధికారులు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ ఉమ్మడి జిల్లాలో పని చేస్తూ సహజ మరణాలతోపాటు మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన ఉద్యోగుల కుటుంబాలకు చెందిన 9 మందికి కండక్టర్ గ్రేడ్-2 కారుణ్య ఉద్యోగ నియామకపత్రాలు అందజేశారు. ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరంలోని రీజనల్ మేనేజర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ తూర్పుగోదావరి జిల్లా అధికారి వైఎస్ఎన్ మూర్తి, కాకినాడ జిల్లా అధికారి ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధికారి ఎస్‌టీపీ రాఘవకుమార్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఈ నియామకపత్రాలు అందజేశారు. రాజమహేంద్రవరం డిపోలో ముగ్గురు, రావులపాలెం డిపోలో ఒకరు, కాకినాడ డిపోలో ముగ్గురు, రామచంద్రపురం డిపోలో ఒకరు ఉద్యోగాలు పొందారని జిల్లా రవాణా అధికారి వైఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రాజమహేంద్రవరం, రావులపాలెం, రాజోలు, ఏలేశ్వరం, కాకినాడ, రామచంద్రపురం, తుని డిపోలు, జిల్లా కార్యాలయాల్లో పనిచేస్తూ సహజ మరణం, మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన ఉద్యోగుల కుటుంబాల్లో అర్హులకు ఈ కారుణ్య నియామకాలు చేపట్టినట్టు ఆయన పేర్కొన్నారు.

ఖాళీస్థలాల టెండర్ల ప్రక్రియపై అవగాహన సదస్సు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆర్టీసీకి సంబంధించిన 11 ఖాళీ స్థలాలను లీజుకు ఇవ్వడానికి సంబంధించిన టెండరు ప్రక్రియపై మంగళవారం రాజమహేంద్రవరంలోని ట్రైనింగ్ కాలేజీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం శివరామ్ (విజయవాడ), జిల్లా ఆర్టీసీ అధికారి వైఎస్ఎన్ మూర్తి, కాకినాడ జిల్లా అధికారి ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధికారి ఎస్‌టీపీ రాఘవకుమార్, రాజమహేంద్రవరం డిపో మేనేజర్ కె.మాధవ్, కొవ్వూరు డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్) ఎన్.కిరణ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సదస్సులో 21 మంది ఔత్సాహిక వ్యాపారులు పాల్గొన్నారని, అనుమతించిన వ్యాపారాలు పదిహేనేళ్లపాటు చేసేందుకు వారికి స్థలాల వివరాలను తెలియజేశామని జిల్లా ఆర్టీసీ అధికారి తెలిపారు.

1,065 లీటర్ల స్పిరిట్ స్వాధీనం

- 10 మంది నిందితుల అరెస్టు
- స్పూరియాస్ లిక్కర్ కేసును ఛేదించిన ఎక్సైజ్ పోలీసులు

కాకినాడ క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనరు చైతన్య మురళి ఆధ్వర్యంలో మంగళవారం కాకినాడలో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం పేరూరులో స్పూరియాస్ లిక్కర్ కేసులో నిందితులను చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐ కె.రవితేజ, కానిస్టేబుళ్లు జి.హనుమంతరావునాయుడు, ఎం.భవనారాయణలను చైతన్య మురళి సత్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసులో 10 మందిని అరెస్టు చేసి 1,065 లీటర్ల స్పిరిట్, అధిక మొత్తంలో విస్కీ సీసాలు, ఒక ఇరాస్ కేప్ సీలింగ్ మిషన్, 6000 ఖాళీ సీసాలు, క్యాప్‌లు, ఒక కిలో కేరమిల్, ఒక ఆటోను స్వాధీ నపర్చుకున్నట్టు డీసీ వివరించారు. ఈ కేసులో స్వాధీనం చేసుకున్న స్పిరిట్‌ను హైదరాబాద్ నుంచి తెచ్చినట్టు గుర్తించి ప్రత్యేక బృందాన్ని హైదరాబాద్ పంపించి దర్యాప్తు చేస్తున్నామన్నారు. సమావేశంలో ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతిపై సమాచారమివ్వాలి

రాజమహేంద్రవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): అవినీతిపై సమాచారాన్ని తెలియజేయాలని, వివరాలను గోప్యంగా ఉంచుతామని అవినీతి నిరోధక శాఖ రాజమహేంద్రవరం రేంజ్ డీఎస్పీ కిషోర్ కుమార్ తెలిపారు. తూర్పు గోదావరికి సంబంధించి 9440446161, కాకినాడ 8332971041, కోనసీమ 9440446163 నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎవరైనా లంచం అడిగినా, అవినీతికి పాల్పడినా, ప్రభుత్వ ఉద్యోగులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నా తెలియజేయాలన్నారు. లంచం తీసుకోవడమే కాకుండా ఇవ్వడం కూడా చట్ట ప్రకారం నేరమేనని ఆయన పేర్కొన్నారు.

గుబ్బాలమ్మకు మంత్రి పూజలు



గోపవరంలో మంత్రి దుర్గేష్‌కి ఆశీర్వచనాలు అందిస్తున్న అర్చకులు

నిడదవోలు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా గోపవరంలో వేంచేసి వున్న గుబ్బాలమ్మ వారికి మంగళవారం ఆషాఢ మాసం సందర్భంగా పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ప్రధాన అర్చకుడు రఘుకుమార్ శర్మ ఆశీర్వచనాలు అందించారు. ఉదయం నుంచి మహాలక్ష్మి హోమం, మహా పూర్ణాహుతి, తదితర పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బెదిరిస్తే చూస్తూ ఊరుకోం

- ముద్రగడ క్రాంతి ఫైర్



పెదశంకర్లపూడిలో మీడియాతో మాట్లాడుతున్న క్రాంతి

ప్రత్తిపాడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గంలో తనకు సహకరించేవారిని బెదిరిస్తే చూస్తూ ఊరుకోబోమని మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం కుమార్తె ముద్రగడ క్రాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆమె కాకినాడ జిల్లా పెదశంకర్లపూడిలో పర్యటించారు. ఈ సందర్భంగా పెదశంకర్లపూడి సర్పంచ్ సూర్నీడి నాగరత్నం స్వగృహం వద్ద మీడియాతో మాట్లాడుతూ తన అనుచరులు, మద్దతుదారులను సోదరుడు, ప్రత్తిపాడు వైసీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అనుచరులు బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ ఫైర్ అయ్యారు. తనకు జనసైనికులు, నాయకులు సహకరిస్తున్నారని అందువల్లే బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ ఆరోపించారు. సమావేశంలో కూటమి, జనసేన నాయకులు సూర్నీడి సురేష్‌కుమార్, బొంకు నాని, నల్లల రామకృష్ణ, మేకల కృష్ణ, కోరుకొండ అప్పారావు, సీరం శ్రీను, సూర్నీడి వీరబాబు, కుప్పిన శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు గురి చేస్తున్న యువకుడిపై కేసు


నల్లజర్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలం నబీపేటకు చెందిన ఒంటరి మహిళను అదే గ్రామానికి చెందిన మర్రి శోభనబాబు లైంగికంగా వేధిస్తున్నాడని అందిన ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్టు సీఐ రాంబాబు పేర్కొన్నారు. దీనికి సంబంధించి విచారిస్తున్నట్టు ఆయన చెప్పారు. ఒంటరి మహిళ సోమవారం తన ఇంట్లో వంట చేస్తుండగా శోభనబాబు వెళ్లి అత్యాచారం యత్నానికి పాల్పడ్డాడు. దీంతో ఇద్దరి మధ్య జరిగిన పెనుగులాటలో ఆమె తలకు దెబ్బతగిలింది. దీంతో తాడేపల్లిగూడెంలోని ఓ ఆసుపత్రిలో చికిత్సపొందుతోంది. సోమవారం సాయంత్రం నల్లజర్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా, మంగళవారం కేసు నమోదు చేశారు.

పురుగుమందు తాగి ఒకరి మృతి

నల్లజర్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలం చోడవరం గ్రామానికి చెందిన ఉప్పులూరి గోపాలకృష్ణ (47) ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగుమందు సేవించాడు. దీంతో ఆసుపత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం గోపాలకృష్ణ వ్యవసాయ కూలీగా పనిచేస్తుండేవాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగి అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. దీన్ని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వారు వచ్చి అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఈయనకు భార్యసత్యవతి, కుమార్తె ఉన్నారు.

పనులు చేయకుండానే బిల్లులు!

- రాజవొమ్మంగి మండలంలో ఫారం పాండ్ నిధుల్లో భారీ అవకతవకలు
- ఉపాధి శ్రామికుల ఖాతాల్లో రూ.70,190 జమ
- మేటు హస్తం ఉన్నట్టు గుర్తించిన అధికారులు



ఎక్స్‌కవేటర్‌తో పనులు చేస్తున్న దృశ్యం

రాజవొమ్మంగి జూలై 8 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలంలో ఫారం పాండ్ నిధుల్లో భారీ అవకతవకలు జరిగాయి. పనులు చేయకుండానే బిల్లులు చేసుకొని ఆడిట్ ఉందని హడావుడిగా జేసేబీతో పనులు చేస్తుండగా ప్రజలు అడ్డుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫారం పాండ్ పనులు కింద్ర పంచాయతీ ముంజవరప్పాడులో ఈ ఏడాది మార్చిలో కాకర ఎర్రయ్య అనే వ్యక్తి భూమిలో జరిగాయి. అయితే ఈ పనులను ఉపాధి శ్రామికులతో చేయించకుండానే అధికారులు సంబంధిత శ్రామికుల ఖాతాల్లో జమచేశారు. ఆ సొమ్ముల్లో రోజుకు రూ.100 తమ వద్ద ఉంచి మిగిలిన సొమ్ములను బలవంతంగా సంబంధిత మేటు తీసుకున్నాడని ప్రజలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో బయపడిన సదరు వ్యక్తి సామాజిక తనిఖీ జరుగుతుందేమోనని హడావుడిగా ఆదివారం ఆ భూమిలో జేసీబీలతో పనులు చేస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. అనంతరం డ్వామా పీడీ, ఐటీడీఏ పీవోకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆ గ్రామంలో సోమవారం ఉపాధి హామీ పథకం ఏపీడీ సత్యనారాయణ విచారణ చేపట్టారు. అలాగే మంగళవారం ఏపీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ 238 పనిదినాలు పనిచేసినట్టు చూపి రూ.70, 190 బిల్లులు జరిగాయని, అయితే ఇక్కడ పనులు జరగలేదని గుర్తించామన్నారు. ఈ పనులు జరిగినట్టు రికార్డు చేసిన టెక్నికల్ అసిస్టెంట్, బిల్లులు అప్రూవ్ చేసిన ఏపీవో, ఎంపీడీవోపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా మండల వ్యాప్తంగా ఇదే రీతిలో అనేక అవకతవకలు జరుగుతున్నాయని, దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మట్టి మాఫియా బరితెగింపు!

- పంగిడి చెరువులో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు
- పొలం మెరక చేసుకోవాలని రైతుల పేరుతో దరఖాస్తులు
- 10వేల క్యూబిక్ మీటర్లకు అనుమతి... తవ్వింది లక్షపైనే
- ఇటుక బట్టీలు, రియల్ వెంచర్లకు ఇతర ప్రాంతాలకు పెద్ద ఎత్తున రవాణా
- రూ.లక్షల్లో దోచుకుంటున్న అక్రమార్కులు


పంగిడి చెరువులో సాగిస్తున్న మట్టి తవ్వకాలు

పెద్దాపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అడిగా రులంటే భయం లేదు... ప్రజలు గమనిస్తారన్న లెక్కే లేదు... రాజకీయ నాయకుల అండదండలు పుష్కలంగా ఉన్నాయన్న ధైర్యమో లేక తమను ఎవరేం చేస్తారన్న ధీమా కాబోలు... మట్టి మాఫియా ఆగదాలకు అడ్డు అదుపులేకుండా పోతోంది. కాకినాడ జిల్లా పెద్దాపురంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. పొలాల మెరక పేరుతో రైతులతో దరఖాస్తు చేయించి అడ్డగోలుగా తవ్వకాలు సాగిస్తున్నారు. 10వేల క్యూబిక్ మీటర్లకు అనుమతి పొంది ఏకంగా లక్ష క్యూబిక్ మీటర్ల పైనే తవ్వేసినట్టు తెలుస్తోంది. నవకాన్ ఇన్ఫ్రా పేరుతో ట్రిప్ షీటు జారీ చేస్తూ తవ్వకాలు సాగించడంతో మట్టి అక్రమ రవాణా జరుగుతోందన్న అనుమానాలు నిజం అవుతున్నాయి. తరలిస్తున్న మట్టి ప్రధానంగా ఇటుక బట్టీలు, రియల్ వెంచర్ల కోసం పెద్ద ఎత్తున రవాణా చేస్తున్నట్టు సమాచారం. కాకినాడ, పరిసర ప్రాంతాల్లో వెలసిన వెంచర్లకు మట్టిని రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నట్టు పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతుల ప్రయోజనం కోసం ప్రభుత్వం క్యూబిక్ మీటరు రూపాయి చొప్పున ఇస్తే అక్రమార్కులు అడ్డదారుల్లో మట్టిని తరలించుకుపోతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా వారు అటువైపు కన్నెత్తి చూడట్లేదని పలువురు చెప్తున్నారు. పెద్దాపురం, వాలు తిమ్మాపురం పరిధిలో సుమారు 64 ఎకరాల విస్తీర్ణంలో పంగిడి చెరువు ఉంది. రైతుల పేరుతో కొంతమంది అక్రమార్కులు జలవనరుల శాఖకు దరఖాస్తు చేయించి మట్టి దందాకు తెరలేపారు. దీంతో జలవనరుల శాఖ అనుమతులు మంజూరు చేసింది. అక్రమార్కులు రంగప్రవేశం చేసి రాత్రనక, పగలనక మట్టిని టిప్పర్ల సహాయంతో తరలించుకుపోతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు సాగిస్తున్నప్పటికీ అధి కారులకు తెలిసినా రాజకీయ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి అటువైపు కన్నెత్తి చూడట్లేదు.



నవకాన్ ఇన్ఫ్రా పేరుతో ఉన్న ట్రిప్ షీటు

పట్టించుకోని అధికారులు...

పొలం మెరక పేరుతో అనుమతి తీసుకుని ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య కార్యకలాపాలకు మట్టిని తరలిస్తున్నారు. సాధారణ రైతులు మట్టి కావాలని అడిగితే సవాలక్ష అం క్షలు విధించే జలవనరుల శాఖ అధికారులు సొ నిక నేతల సిఫార్సులతో ఆగమేఘాలపై అనుమతులు మంజూరు చేసేశారు. కాకినాడ, ఉండూరు, కరప, పిఠాపురం తదితర ప్రాంతాలకు మట్టిని తరలిస్తున్నారు. నిత్యం 200 లారీలు పైబడి మట్టిని రేయింబవళ్లూ ఇబ్బడిముబ్బడిగా తవ్వేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఈతంతంగం గత నెల రోజులుగా సాగుతున్నా అధికారులు పట్టించుకోవట్లేదని పలువురు చెబుతున్నారు.

నిబంధనలకు నీళ్లు...

పంగిడి చెరువులో ఇరిగేషన్ అధికారులు ఒక క్యూబిక్ మీటర్ లోతు వరకే పూడికతీత పేరుతో అనుమతి ఇచ్చినట్టు తెలుస్తోంది. కానీ 7-8 అడుగుల లోతున చెరువును ఎడాపెడా తవ్వేశారు. పైగా రాత్రి సమయంలో కూడా ఈ తవ్వకాలు సాగిస్తున్నారు. వాస్తవానికి ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకే తవ్వకాలు జరగాల్సి ఉండగా మట్టి మాఫియా మాత్రం దీనిని పూర్తిగా విస్మరించింది. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నాయని తెలిసినా సరే అధికారులు పట్టించుకోకపోవడంతో వారి తీరుపై పలు అనుమానాలు కలుగుతున్నాయి.

మట్టి తవ్వకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

పంగిడి చెరువులో మట్టి తవ్వకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశా. పొలం మెరక చేసుకు నేందుకు గతంలో జలవనరుల శాఖకు దరఖాస్తు చేసుకున్నా అనుమతి ఇవ్వలేదు. పొలాలు మెరక చేసుకోవడానికి మట్టి దొరక్క సాధారణ రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు. అధికారులు అక్రమార్కులకే ముందు అనుమతులు మంజూరు చేస్తున్నారు. మట్టి అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి.

జి.లక్ష్మణరావు, రైతు, పెద్దాపురం

ఆహారం రెడీమేడ్!



పక్షులకు ఆహారం పెట్టడానికి ధాన్యం కుచ్చులను ఇళ్ల వద్ద పర్రాటు చేస్తుంటారు. అయితే వాటిని కూడా రెడీమేడ్ దుస్తుల్లా రెడీ చేసి అమ్ముతున్నారు. కాకినాడలో ఆటోకు ఇలా ధాన్యం కుచ్చులను తగిలించి విక్రయాలు చేస్తున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

పెదపళ్లలో చోరీ

బీరువాలోని 11 కాసుల బంగారు ఆభరణాలు, 500 గ్రాముల వెండి మాయం

ఆలమూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఆలమూరు మండలం పెదపళ్లలో ఒక ఇంట్లో బంగారం, వెండి ఆభరణాలు దొంగతనం జరిగినట్టు ఆలమూరు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన నరసింహదేవర వెంకటదుర్గామల్లేశ్వరి ఇంట్లోని బీరువాలో బంగారు, వెండి ఆభరణాలు పెట్టి ఈనెల 4న తిరుపతికి వెళ్లారు. 7న వచ్చి చూడేసరికి బీరువాలోని 11 కాసుల బంగారు, 500 గ్రాముల వెండి ఆభరణాలు దొంగతనానికి గురైనట్టు గుర్తించి ఆలమూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలమూరు ఎస్ఐ జి.నరేష్ కేసు నమోదు చేశారు.

పెట్టుబడులు రాకుండా జగన్ కుట్రలు

రాష్ట్రంలో 6లక్షల ఇళ్ల పూర్తికి ప్రణాళిక సిద్ధం : మంత్రి పార్థసారథి


తుని సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి

తుని రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా జగన్ అండ్ కో కుట్రలు పన్నుతున్నారని, పరిశ్రమల పేరుతో ఆరాచకాలకు పాల్పడుతూ రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తేవిధంగా నడుచుకుంటున్నారని సమాచార గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. కాకినాడ జిల్లా తునిలో మంగళవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దివ్యతో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలుగుదేశం టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అధిక మొత్తంలో వస్తున్న పెట్టుబడులను చూసి జగన్ తట్టుకోలేకపోతున్నారని, ఎక్కడ జరిగి యువత ఉపాధి అవకాశాలు మెరుగుపడితే తమ ఆటలు సాగవని ఇప్పటి నుంచే పెట్టుబడులు రాకుండా వివిధ రూపాల్లో అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. పరామర్శలు బయటకొచ్చి వీధి పోరాటాలకు ఆద్యం పోస్తున్నారన్నారు. వైసీపీ పాలనలో ఎంతోమంది పారిశ్రామికవేత్తలు రాష్ట్రాన్ని వదిలిపోయారని, ఎన్నో కంపెనీలు ఇతర రాష్ట్రాలకు తరలిపోయాయని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం చంద్రబాబును నమ్మకంతో పెట్టుబడుదారులు రాష్ట్రం వైపు క్యూ కడుతున్నారని తెలిపారు. జగన్ ఆరాచకాలను తిప్పికొట్టి వైఎస్‌సీపీ ఎక్కడికి ప్రతిపక్షంలోనే కూర్చోబెట్టాలన్నారు. ఆరాచకవాదులు, అవినీతిపరులే రెడ్‌బుక్‌ని చూసి భయపడుతున్నారని, ఎవరైనా వైసీపీ పాలనలో దుర్మార్గంగా వ్యవహరించారో వారికిప్పుడు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని తెలిపారు. రపారపా అనే పదాలు స్వయంగా సీఎంగా పని చేసిన వ్యక్తే మాట్లాడితే రాష్ట్రంలో యువత ఎటువంటి దారి పడుతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. 2026 కల్లా రాష్ట్రంలో 6లక్షల ఇళ్ల పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్ బాబు, టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రాజేష్, టీడీపీ మండలాధ్యక్షుడు చింతమనేడి అబ్బాయి, మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి, మోతుకూరి వెంకటేష్, యినిగిరి సత్యనారాయణ, కుసుమంచి శోభారాణి ఉన్నారు.

అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యం పట్టివేత

కాకినాడ రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం తూరంగిలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన రూ.5,27,077 విలువ చేసే 11 టన్నుల 335 కిలోల రేషన్ బియ్యాన్ని రెవెన్యూ, పోలీస్ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకుని కాకినాడలోని ఎంఎల్ఎస్ పాయింట్ తరలించినట్టు సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ ఎమ్.వీరాస్వామి తెలిపారు. సామర్లకోట మండలం వీకే రాయపురానికి చెందిన తలారి వీరబాబు గ్రామంలో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తుండేవాడని, అదే గ్రామానికి చెందిన అనుమోలు వరహాలు బియ్యం వ్యాపారం చేస్తుండేవాడని, వారిద్దరూ తూరంగి డ్రైవర్స్ కాలనీలోని ఓ ఇంట్లో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేయడంతో దాడి చేసి పట్టుకున్నామన్నారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని 6ఏతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేశామని ఇంద్ర పాలెం ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపారు. దాడిలో తూరంగి వీఆర్వోలు నాగేశ్వరరావు, సునీత, ఇంద్రపాలెం పోలీసులు రాజు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యంతో అధికారులు, పోలీసులు

ఎన్‌వోసీలు ఆపండి!

- 'పక్కాగా స్కెచ్'పై ఆంధ్రజ్యోతి కథనం ఎఫెక్ట్
- మైనింగ్ దరఖాస్తుదారులెవరికీ ఎన్‌వోసీలు ఇవ్వొద్దు
- ఉమ్మడి జిల్లాలో మైనింగ్ దరఖాస్తు దారులకు స్కెచ్‌ల విక్రయ బాగోతంపై కలెక్టర్ల ఆరా
- ఏడీ, ఇన్‌చార్జి డీడీని పిలిపించి తెరవెనుక వ్యవహారంపై నిలదీత
- అటు ఎవరెవరు ఎంత ముడుపులు ఇచ్చారో ఆరా తీయించిన కాకినాడ కలెక్టర్
- సర్వేయర్‌కు స్కెచ్‌ల కోసం డబ్బులు ఇచ్చింది నిజమేనని దరఖాస్తుదారుల అంగీకారం
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దాఖలైన 53 దరఖాస్తులను రప్పించి స్కెచ్‌ల పరిశీలన
- అటు అక్రమాలకు పాల్పడిన సర్వేయర్‌ను పిలిపించి హెచ్చరించిన వైనం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దాఖలైన మైనింగ్ దరఖాస్తులకు స్కెచ్‌ల విక్రయంపై భారీగా వెనకేసుకున్న వ్యవహారంలో గనుల సర్వేయర్‌కు ఉచ్చు బిగుస్తోంది. ఒకరికి తెలియకుండా మరొకరికి మైనింగ్ స్కెచ్‌లు విక్రయించడం, అటు భారీ మొత్తాల్లో డబ్బులు గుంజేసి స్కెచ్‌లు ఒకే వ్యాపారికి అందేలా చేసిన అడ్డగోలు లబ్ధి చేకూర్చిన సదరు సర్వేయర్ తీరుపై విచారణకు రంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్లు ఈ అక్రమాల బాగోతంపై దృష్టిసారించారు. రాజమహేంద్రవరం గనులశాఖ ఏడీ, కాకినాడ గనులశాఖ ఇన్‌చార్జి డీడీగా వ్యవహరిస్తున్న ఫణిభూషణ్ రెడ్డిని వేర్వేరుగా పిలిపించి విచారించారు. దరఖాస్తులు దాఖలుకు తప్పనిసరిగా అవసరమైన స్కెచ్‌ల విక్రయం వెనుక అసలు ఏం జరిగిందనే దానిపై ఆంధ్రజ్యోతిలో కనివారం వచ్చిన కథనంపై ఆరా తీశారు. దరఖాస్తుదారులకు స్కెచ్‌లు విక్రయించిన మటకలో సర్వేయర్ పాత్ర ఏస్థాయిలో ఉంది. మొత్తం వచ్చిన దరఖాస్తుల్లో తెలి వరు సల్లో ఎవరు ఉన్నారు? దరఖాస్తుదారుల వాకిలు ఎవరికి ఎన్ని స్కెచ్‌లకు ఎంతెంత వసూలు చేశారు? వంటి అంశాలపై ఇద్దరు కలెక్టర్లు విచారించారు. అటు దాఖలైన మొత్తం 53 దరఖాస్తుల్లో 42 వరకు కాకినాడ జిల్లా రౌతులపూడిలో క్వారీ మైనింగ్ కోసమే రావడంతో ఈ వ్యవహారంపై కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సీరియస్‌గా ఉన్నారు. మొత్తం దాఖలైన దరఖాస్తులన్నీ ఆఫీస్ రప్పించారు. ఆయా మైనింగ్ స్కెచ్‌లను పరిశీలించారు. ఎవరెవరు ఎంతెంత విస్తీర్ణానికి మైనింగ్ స్కెచ్‌లు జతచేశారో లోతుగా పరిశీలించారు. ఒక్కొక్క స్కెచ్‌కు సదరు సర్వేయర్ ఎంత వసూలు చేశారు? అనేదానిపై కొందరు ఆర్‌ఐల ద్వారా దరఖాస్తుదారులకు ఫోన్లు చేయించి విచారణ చేయించారు. ఈక్రమంలో తాము సర్వేయర్‌కు స్కెచ్ కోసం ఎంతెంత ముట్టజెప్పింది కూలంకషంగా వారంతా వివరించారు. ఈ నేపథ్యంలో స్కెచ్‌ల పేరుతో డబ్బులు వసూళ్లు జరిగిన మాట వాస్తవమేనని నిర్ధారించారు. ఈ నేపథ్యంలో మైనింగ్ లీజుల మంజూరులో అత్యంత కీలకమైన ఎన్‌వోసీల జారీని తక్షణం నిలిపివేయాలని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి తహశీల్దార్లను కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. ఈ అక్రమాల బాగోతం తేలే వరకు ఏ వ్యాపారికి ఎన్‌వోసీలు జారీ చేయకూడదని వారికి స్పష్టంచేశారు. అటు దాఖలైన దరఖాస్తులను సైతం లీజుల మంజూరుకు వీలుగా ప్రాసెస్ చేయకుండా దరఖాస్తులను సీజ్ చేశారు. అలాగే లీజుల కోసం వచ్చిన దరఖాస్తుదారుల్లో ఇతర ప్రాంతాల వ్యాపారులు ఉన్నారా? భారీ మైనింగ్ విస్తీర్ణం కోసం ఎవరెవరు అప్లికేషను చేశారనేది విచారించారు. ఇదిలాఉంటే అక్రమాలకు పాల్పడి స్కెచ్‌ల విక్రయించిన సర్వేయర్‌ను కాకినాడ జిల్లా కలెక్టర్ మంగళవారం పిలిపించారు. స్కెచ్‌ల విక్రయంతో భారీగా వెనకేసుకోవడం, సర్వేయర్‌కు డబ్బులు ఇచ్చిన మాట వాస్తవమేనని దరఖాస్తుదారులు ఇప్పటికే విచారణలో వెల్లడించిన విషయాన్ని ఆయన ఎదుట ప్రస్తావించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి తలవంపులు తెచ్చేలా వ్యవహరించడంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ పటనపై విచారణ ఎదుర్కోవాల్సింటుందని తెగేసి చెప్పారు. మరోపక్క, పక్కాగా స్కెచ్ వేసి మైనింగ్ దర ఖాస్తుదారుల నుంచి లక్షల్లో డబ్బులు గుంజేసిన రూ.కోటి వరకు డబ్బులు గుంజేసిన గనుల సర్వేయర్‌పై ఆంధ్రజ్యోతిలో కనివారం, ఆదివారం వచ్చిన కథనాలపై ఇంటెలిజెన్స్ ఆరా తీసింది. సదరు సర్వేయర్ ఎవరెవరి నుంచి ఎంత వసూలు చేసింది వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక పంపింది.

గంజాయితో ఐదుగురి అరెస్ట్

4 కిలోల స్వాధీనం


నిందితులు, గంజాయితో సీఐ సత్యనారాయణ బృందం

కాకినాడ క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గంజాయిని తరలిస్తున్న ఐదుగురు నిందితులను కాకినాడ త్రీటౌన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ అర్బన్ వెంకటేశ్వరనగర్ శివారు మద్ది లక్ష్మి గోడౌన్ వద్ద గంజాయి రవాణా జరుగుతున్నట్టు త్రీటౌన్ సీఐ కెవివి.సత్యనారాయణకు వచ్చిన సమాచారం మేరకు రెవెన్యూ సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లగా ఐదుగురు వ్యక్తులు ప్లాస్టిక్ కవర్లలో గంజాయిని కలిగి ఉండడాన్ని గుర్తించారు. నిందితుల్లో పిఠాపురం అగ్రహారానికి చెందిన నంగాడా రాజేష్ (21), పిఠాపురం మండలం నరసింగాపురం గ్రామానికి చెందిన బోదా వీరసుబ్రహ్మణ్యం అలియాస్ బన్ని (21), ఎన్ఎస్ఆర్ జిల్లా చింతపల్లి మండలం బోరడింతలు గ్రామానికి చెందిన కొర్ర సత్తిబాబు (47), గొల్లప్రోలు మండలం మార్కెండేయపురం గ్రామానికి చెందిన అరి ఆదర్శ్(27), పిఠాపురం చిట్టెడితోటకు చెందిన ఎర్రంశెట్టి అవినాష్ అలియాస్ పండు(21)ను అరెస్ట్ చేసి వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారిని కాకినాడ నాల్గో ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపర్చనున్నట్టు సీఐ వెల్లడించారు.

ధవళేశ్వరంలో ఇద్దరి అరెస్ట్

11 కిలోల గంజాయి, 2 మోటార్ సైకిళ్లు, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం

ధవళేశ్వరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధిలో వైజాగ్ ఏజెన్సీ ప్రాంతాల నుంచి తీసుకువస్తున్న 11 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాజమహేంద్రవరం స్వరూప్‌నగర్‌కు చెందిన కె.పవన్‌కుమార్, కంబాల చెరువు ప్రాంతానికి చెందిన పి.సతీష్ అలియాస్ డింపు వైజాగ్ పరిధిలోని ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయిని కొనుగోలు చేసి ధవళేశ్వరంలో విక్రయించడానికి తీసుకురాగా ధవళేశ్వరం సీఐ టీగణేష్, సిబ్బందితో వారిని పట్టుకుని 11 కిలోల గంజాయి, 2 మోటార్ సైకిళ్లు, 2 సెల్‌ఫోన్లు, రూ.1000 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు.

ఆయిల్ ట్యాంకర్ ఢీకొని మహిళ మృతి

భర్త, పిల్లలకు గాయాలు


పటవల సెంటర్‌లో మృతిచెందిన మహిళ

తాళ్లరేవు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పటవల వద్ద 216 జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో మహిళ మరణించింది. కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. తాళ్లరేవు మండలం ఇంజరం జైభీమ్‌నగర్‌కు చెందిన దడాల శేఖర్ భార్య, పిల్లలను తీసుకుని మోటారుసైకిల్‌పై కాకినాడ ఆసుపత్రికి బయలుదేరారు. పటవల సెంటరులో వెనుక నుంచి ఆయిల్ ట్యాంకర్ ఢీకొనగా రూప్వేలక్ష్మి (28) అక్కడికక్కడే మృతిచెందింది. శేఖర్, పిల్లలు స్వల్పగాయాలతో బయటపడ్డారు. స్థానికులు వారిని 108లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. పటవల పంచాయతీ మహిళా పోలీసు సమాచారం మేరకు కోరంగి పోలీసులు కేసు నమోదు చేశారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి


మరణించిన లక్ష్మణ్

ధవళేశ్వరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎదురుగా వస్తున్న ఆటోను తప్పిస్తున్న ప్రయత్నంలో వెనుక వచ్చిన లారీ ఢీకొని వ్యక్తి బలైపోయాడు. వివరాల్లోకి వెళితే.. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం కొండ మెరకకు చెందిన పువ్వల లక్ష్మణ్(36) పెయింటింగ్ పనులు చేస్తూ భార్య, ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నాడు. మంగళవారం ఉదయం పని కోసం స్కూటీపై రాజమహేంద్రవరం బయలుదేరాడు. సూరజ్యానగర్ పొలకేంద్రం సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించే ప్రయత్నంలో ఆటో తగిలి కింద పడిపోయాడు. అదే సమయంలో వెనుక నుంచి ఇసుక లోడుతో వస్తున్న లారీ వెనుక చక్రం లక్ష్మణ్ కాళ్ల పైనుంచి వెళ్లిపోవడంతో కాలు ఛిద్రమైంది. దీంతో అతడిని స్థానికులు 108 అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ధవళేశ్వరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీని ఢీకొన్న కంటైనర్

డ్రైవర్ మృతి


మరణించిన డ్రైవర్ నాగార్జున

దేవరపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎదురుగా వెళ్తున్న లారీని వెనుక నుంచి కంటైనర్ లారీ వేగంగా ఢీకొనడంతో కంటైనర్ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి గాయాలతో మరణించిన సంఘటన సంఘటన తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలంలో జరిగింది. విశాఖపట్నం నుంచి బెంగుళూరుకు చిన్న సిలిండర్ల లోడుతో వెళ్తున్న కంటైనర్ లారీ మంగళవారం దేవరపల్లి మండలం కృష్ణంపాలెం జాతీయ రహదారి వద్ద ఎదురుగా వెళ్తున్న లారీని ఢీకొంది. దీంతో కంటైనర్ డ్రైవర్ నాగార్జున (30)కు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. అతడు కర్నూల్ రాష్ట్రం మార్కాపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి అని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వీసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు.

ఏటీఎంలో మంటలు

యానాంలో ఐదు ద్విచక్ర వాహనాలు, కారు ఆహుతి


అగ్నికి ఆహుతైన ఏటీఎం, కారు, ద్విచక్రవాహనాలు

యానాం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): యానాం బస్‌స్టాండ్ వెనుక ఉన్న కంచర్ల కాంప్లెక్స్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. మంగళవారం ఉదయం కాంప్లెక్స్‌లో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అక్కడే ఉన్న మెకానిక్ షెడ్డుకు సంబంధించిన ఐదు ద్విచక్ర వాహనాలు, కారు అగ్నికి ఆహుతయ్యాయి. ఉదయం 7 గంటల సమయంలో ఏటీఎం నుంచి మంటలు రావడాన్ని గమనించి స్థానికులు యానాం అగ్నిమాపకశాఖకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన చేరుకున్న సిబ్బంది మంటలను అదుపుచేశారు. అయితే ఈ ఏటీఎంలో 10 రోజుల క్రితం రూ.15లక్షల90వేల నగదు పెట్టడం జరిగిందని, కొన్ని రోజులుగా ఏటీఎం రిపేరు వచ్చిందని తెలిపి చూస్తేగాని ఎంత నగదు నష్టం వాటిల్లిందో తెలియదని రాజమండ్రికి చెందిన హిటాచీ అధికారులు తెలిపారు. ఏటీఎం సంబంధించి సుమారు రూ.8లక్షల వస్తునష్టం జరిగిందన్నారు. షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగిందని ఉండవచ్చని తెలుస్తోంది. యానాం అగ్నిమాపకశాఖ వివరాలను నమోదు చేశారు.

చెట్టుకు ఉరేసుకున్న బాలిక



మోతుగూడెం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలోఉన్న కొత్తపల్లి పంచాయతీ గొందిగూడెం గ్రామంలో బాలిక ఉరే సుకుని మృతిచెందింది. మంగళవారం ఉదయం 8గంటలకు గొందుగూడెం గ్రామానికి చెందిన సేరమయ్య కుమార్తె కరాజయ రంపచోడవరం కాలేజీ నుంచి తిరిగి వచ్చి తమ పొలంలో చెట్టుకు చున్నీతో ఉరేసుకుని చనిపోయింది. సమాచారం తెలుసుకున్న మోతుగూడెం ఎస్ఐ సాధిక్ పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మహిళ మృతి


మరణించిన మహిళ

అడ్డతీగల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా అడ్డతీగల మండలం తుంగమడుగుల గ్రామ సమీపంలో రోడ్డుపక్కన గుర్తు తెలియని మహిళ ప్రమాదానికి గురైంది. దీంతో కొందరు బాటసారులు దుప్పులపాలెం ప్రభు త్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతిచెందినట్టు వైద్యాధికారులు నిర్ధారించారు. మృతురాలి వయస్సు సుమారు 30నుంచి40 ఏళ్ల ఉండవచ్చని, మతిస్థిమితం లేకుండా తిరుగుతూ ఉంటుందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్టు అడ్డతీగల ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు.


గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అడ్డతీగల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా అడ్డతీగల మండలం భీముడుపాకలు మోడకొండమ్మ ఆలయ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. సుమారు 5 అడుగుల 7 అంగుళాల పొడవు ఉండి మృతదేహంపై వనపురంగు డిజైన్ షర్టు, నీలం రంగుపాంట్లు, నలుపు రంగు చెప్పులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. అడ్డతీగల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు అడ్డతీగల సీఐ తెలిపారు. ఎవరైనా గుర్తుపడితే 9440900768, 69కు సమాచారమివ్వాలని ఎస్ఐ వినోద్ కుమార్ కోరారు.


భీముడుపాకల సమీపంలో లభ్యమైన వ్యక్తి మృతదేహం

అదృశ్యమైన ఇద్దరు బాలికలు తల్లిదండ్రులకు అప్పగింత

మండపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం అంగరకు చెందిన 8వ తరగతి చదువుతున్న ఇద్దరు బాలికలు సోమవారం ఇంటి నుంచి హైస్కూలుకు బయలుదేరి కనిపించకుండా పోయారు. పోలీసులు వారి ఆచూకీ కనిపెట్టి తల్లిదండ్రులకు అప్పగించారు. విద్యార్థినులు పాఠశాలకు రాలేదని ఉపాధ్యాయులు వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దీంతో వారు అంగర పోలీసులను ఆశ్రయించారు. వెంటనే మిస్సింగ్ కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ బిక్షపార్థావ ఆదేశాల మేరకు రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్, ప్రత్యేక పర్యవేక్షణలో మండపేట రూరల్ సీఐ వేలు దొరరాజు, అంగర ఎస్ఐ జి.హరీష్, మండపేట రూరల్ ఎస్ఐ వి.కిషోర్, సిబ్బంది ప్రత్యేక బృందంగా ఏర్పడి బాలికల ఆచూకీ కోసం లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. బాలికలు కాకినాడ-తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలులో తిరుపతి వైపు వెళ్తున్నారని సమాచారం అందుకున్న సిబ్బంది తిరుపతి, రాజమహేంద్రవరం, విజయవాడ, ఒంగోలు, తిరుపతి రైల్వేస్టేషన్‌లలో రైల్వేపోలీసు ప్రొటెక్షన్ ద్వారా పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇన్‌ఫార్మర్‌తో ట్రైన్‌ను తనిఖీ చేసి రాత్రి 12 గంటల సమయంలో ఇద్దరు బాలికలను ఒంగోలు వద్ద గుర్తించి వారిని తిరిగి అంగరకు తీసుకొచ్చి వారి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించామని డీఎస్పీ తెలిపారు. బాలికల మిస్సింగ్ కేసును గంటల వ్యవధిలో ఛేదించిన రామచంద్రపురం డీఎస్పీ, ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి, సీఐ, ఎస్ఐలు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.


సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్, ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

ఏఎస్‌డీ కళాశాలలో 11న జాబ్ డ్రైవ్

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జగన్నాథపురంలో గల ఏఎస్‌డీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కాకినాడ ధరిత్రి అడ్వైజరీ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ టెలీకాలర్ ఉద్యోగాల కోసం ఈ నెల 11న జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అనంతలక్ష్మి తెలిపారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారు కాకినాడ కార్యాలయంలో పనిచేయాల్సి ఉంటుందన్నారు.

సర్పవరం సొసైటీ చైర్మన్‌గా కటకంశెట్టి బాబీ

సర్పవరం జంక్షన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్)కు చైర్‌పర్సన్లు, డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కాకినాడ రూరల్ మండలం సర్పవరం పీఏసీఎస్ చైర్మన్‌గా టీడీపీ కాకినాడ రూరల్ కో-కో-ఆర్డినేటర్ కటకంశెట్టి వెంకట ప్రభాకర్ (బాబీ)ని నియమించారు. దీనిపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. డీసీసీబీ చైర్‌పర్సన్ పదవి కోసం తాను సర్పవరం సొసైటీలో చేరానన్నారు. దానిని జనసేనకు కేటాయించడంతో తన పేరును సర్పవరం సొసైటీ చైర్మన్ పదవికి పరిగణలోకి తీసుకోవద్దని టీడీపీ అధిష్ఠానానికి చెప్పానన్నారు. ఆ పార్టీలో నాయకుడిగా కొనసాగుతానని స్పష్టం చేశారు. పండూరు పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్‌ను నియమించారు.

విద్య, ఉపాధి ప్రోత్సాహకాలు అందజేత

సామర్లకోట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట లయన్స్ భీమేశ్వర క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ అమలకంటి శ్రీనివాసరావు-శేషారత్నం దంపతులు ఒక విద్యార్థినికి విద్య నిమిత్తం రూ.10వేలు అందజేశారు. క్యాన్సర్ వ్యాధితో చికిత్స పొందుతున్న ఒక యువతికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10వేలు అందజేశారు. ఇద్దరు మహిళలకు కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. డాక్టర్ శ్రీనివాసరావు దాతృత్వాన్ని పలువురు క్లబ్ సభ్యులు, లబ్ధిదారులు అభినందించారు.



కొత్తపల్లి మండలం కుతుకుడుమిల్లిలో మొక్క నాటుతున్న కూటమి పార్టీల నేతలు



గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో తైవాన్ జామ మొక్క నాటుతున్న జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు



కరప మండలం గొర్రిపూడిలో కొబ్బరి మొక్క నాటుతున్న ఎంపీడీవో అనుపమ, కూటమి నాయకులు

వన మహోత్సవం

కొత్తపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వన మహోత్సవంలో భాగంగా మండలంలోని కుతుకుడుమిల్లి ప్రాథమిక పాఠశాలలో కూటమి నేతలు మంగళవారం మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. సర్పంచ్ కర్రి చిన్నారావు, జనసేన నాయకుడు, కాకినాడ జీజీహెచ్ డైరెక్టర్ రావు అక్షయ్, టీడీపీ నాయకులు రెడ్నం దొరబాబు, కుక్కల రామకృష్ణ, బీజేపీ చేనేత మోర్చా రాష్ట్ర కన్వీనర్ రవణం సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో పి.రవికుమార్, పంచాయతీ కార్యదర్శి చాందిని, బిల్ కలెక్టర్ లక్ష్మణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలేకుర్రు పంచాయతీ సుంకటరేవులో రైతు దడాల సింహాద్రమ్మకు చెందిన ఒక ఎకరం తోటలో హార్టీకల్చర్, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమానికి ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో జిల్లా అధికారి అడపా వెంకటలక్ష్మి, ఎంపీడీవో సత్యనారాయణ, ఏపీవో తేజస్విని, జేఈ నారాయణమూర్తి, టెక్నికల్ అసిస్టెంట్లు సరస్వతి, శ్రీనివాస్, మాజీ సర్పంచ్ దడాల బుజ్జిబాబు, టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగ సూర్యనారాయణ, ధూళిపూడి వెంకటరమణ, వాడ్రేవు వీరబాబు, వుంగరాల వెంకటేశ్వరరావు, కంచర్ల లక్ష్మణరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, ఉపాధి కూలీలు, పంచాయతీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కరప (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుగుదురు, గొర్రిపూడి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన వన మహోత్సవంలో ఎంపీడీవో మట్టపర్తి అనుపమ, జనసేన మండల శాఖ అధ్యక్షుడు బండారు మురళి మొక్కలు నాటారు. పెనుగుదురు సొసైటీ కార్యదర్శి పడాల నాగేశ్వరరావు, కార్యదర్శులు జీసీహెచ్ శ్రీకాంత్, వీరబాబు, గొర్రిపూడి నీటి సంఘం అధ్యక్షుడు జోకా తాతాజీ, కూటమి నాయకులు అనుకుల రాంబాబు, పుణ్యమంతుల అన్నవరం, గంటా నానిబాబు, జల్దాని ఏసుగంగాధర్, పుణ్యమంతుల గంగరాజు, సత్తిబాబు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పిఠాపురం రూరల్ (ఆంధ్రజ్యోతి): వన మహోత్సవంలో భాగంగా చిత్రాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గండి కొండలరావు, చిత్రాడ సర్పంచ్ కొత్తలూరి సునీత, ఎంపీడీవో చిన్నారావు, ఏపీవో నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన హార్టీకల్చర్ ప్లాంటేషన్‌ను గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ప్రారంభించారు. బవిరిశెట్టి చెల్లాయమ్మ పొలంలో తైవాన్‌జామ మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



తాళ్లరేవు మండలం పోలేకుర్రులో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే సుబ్బరాజు

రేపు జాబ్‌మేళా

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 8 (ఆంధ్రజ్యోతి): అపోలో ఫార్మసీ, పేటీఎం, ఇనోసోర్స్, భారత్ ఫైనాన్షియల్ ఇంక్లూజన్ (బీఎఫ్ఐఎల్) వంటి ప్రముఖ కంపెనీలతో జిల్లా ఉపాధి కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి ఇ.వసంతలక్ష్మి తెలిపారు. ఆసక్తి కలిగిన పురుషులు, మహిళలు బయోడేటా, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 86398 46568 నెంబరును సంప్రదించాలన్నారు.



అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లు, వంటపాత్రలు పంపిణీ

పిఠాపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రాలకు ఎలక్ట్రికల్ ఇండక్షన్ స్టవ్‌లు, స్టీలు వంట పాత్రలను కూటమి నాయకులు, అధికారులు అందజేశారు. అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ప్రీ ప్రైమరీ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గండి కొండలరావు, ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్ఎస్‌కే దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.



చిత్రాడలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

బాబు, పవన్, లోకేశ్‌లను విమర్శించే స్థాయి లేదు

మాజీ మంత్రి బొత్స సత్యనారాయణపై మాజీ ఎమ్మెల్యే వర్మ ఫైర్

పిఠాపురం రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌లను విమర్శించే స్థాయి వైసీపీ నేత బొత్స సత్యనారాయణకు లేదని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. బొత్సతో పాటు వైసీపీ నేతలు చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. మంగళవారం ఆయన పిఠాపురం మండలం చిత్రాడలో మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో ఏడాది కాలంలోనే ఎంత అభివృద్ధి జరిగిందో మీరు కారు ఎక్కి తిరిగితే తెలుస్తుందన్నారు. కనీసం మీ వైసీపీ నాయకులను అడిగినా చెప్పేవారన్నారు. అంతేగానీ గాని అభివృద్ధిని చూసి అసూయతో మాట్లాడవద్దని హితవు పలికారు. మోసగాళ్లకు మోసగాడు జగన్‌రెడ్డి అన్నారు. పోలవరం ప్రాజెక్టు, రాజధాని అమరావతిని వైసీపీ పాలనలో భ్రష్టుపట్టించారని విమర్శించారు. ఇప్పుడు వారు వచ్చి ఇష్టం వచ్చిన రీతిలో వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జిల్లాలో లక్షా రెండు వేల బంగారు కుటుంబాలు గుర్తింపు: కలెక్టర్

పెద్దాపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతి ప్రభుత్వ ఉద్యోగీ బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని కలెక్టర్ షాన్‌మోహన్ కోరారు. కాకినాడ జిల్లా వ్యాప్తంగా లక్షా రెండువేల బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. పీ4 కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మండలంలోని వడ్లమూరులో దొండపాటి చార్లెస్ ఇంటిని సందర్శించి కుటుంబసభ్యులతో మాట్లాడారు. వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి వారికి అందుతున్న పథకాలు, సౌకర్యాలు, ఉపాధి అవకాశాలపై ఆరా తీశారు. అట్టడుగున ఉన్న కుటుంబాలను గుర్తించి వారికి సాయం అందించడమే పీ4 లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా నుంచి గ్రామ స్థాయి వరకు ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు మార్గదర్శకులుగా బంగారు కుటుంబాలను దత్తత స్వీకరిస్తారన్నారు. కలెక్టర్‌గా తాను ఐదు కుటుంబాలను దత్తత తీసుకున్నానన్నారు. రెండు, మూడు నెలల్లో వారి అవసరాలను ఎలా అధిగమించేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేస్తామన్నారు. ఆగస్టు 15 నాటికి ప్రతి ఒక్క మార్గదర్శికి ఒక బంగారు కుటుంబాన్ని అనుసంధానం చేయాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. అనంతరం కలెక్టర్ మొక్కలు నాటారు. ఆర్డీవో కె.శ్రీరమణి, తహసీల్దారు సీహెచ్ వెంకటలక్ష్మి, ఎంపీడీవో డి.శ్రీలలిత తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌లో బాల రక్షణ కమిటీకి శిక్షణ

కాకినాడ రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మిషన్ వాత్సల్యలో భాగంగా కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల రక్షణ కమిటీ (మహిళా పోలీసుల అడ్మిన్స్, వీఆర్వోలు)కి బాలల హక్కులపై శిక్షణనిచ్చారు. బాలల రక్షణ, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, దత్తత, పోక్సో చట్టం, శిక్షలపై అవగాహన కల్పించారు. హోంలో ఉన్న పిల్లలను దత్తత తీసుకున్నవారికి కొంతకాలం నెలకి రూ.4,000 ఇస్తారని చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది వెంకట్, శ్రీనివాస్, సుధాకర్, విజయ, ఈవోలు దయామణి, గౌరి, అరుణశ్రీ, జానకి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



సూరంపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సీతారామరాజును అభినందిస్తున్న డీఈవో రమేశ్

టీచర్ సీతారామరాజుకు డీఈవో అభినందన

గొల్లప్రోలు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పాఠశాలకు వచ్చేందుకు కాలిబాట వంతెన నిర్మించిన ఉపాధ్యాయుడు అనిశెట్టి సీతారామరాజు అందరికీ స్ఫూర్తిదాయకంగా, మార్గదర్శిగా నిలిచారని డీఈవో పి.రమేష్ పేర్కొన్నారు. 'విద్యా వారధి' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన డీఈవో మంగళవారం సూరంపేట ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. సీతారామరాజు నిర్మించిన వంతెనను పరిశీలించి ఆయన్ను సత్కరించారు. డీఈవో వెంట గొల్లప్రోలు ఎంఈవో శివప్రసాద్ వున్నారు.



గురుపూర్ణిమ ఉత్సవాలు ప్రారంభం

సామర్లకోట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆంధ్ర సాయిగీతా సమాజం షిర్డీ సాయిబాబా ఆలయంలో గురుపూర్ణిమ ఉత్సవాలు మంగళవారం ప్రారంభమ య్యాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు దవులూరి సుబ్బారావు-పార్వతి దంపతులు, దన్నాల అప్పారావు, గంగ్రోతుల సత్యనారాయణ, కొప్పన రాంబాబు, దుక్కా రాజబాబు ఆధ్వర్యంలో పండితుల వేదమంత్రోచ్ఛారణల మధ్య బాబాను పంచ ద్రవ్యాలతో అభిషేకించారు. విశేష పుష్పార్చన అనంతరం సాయిబాబా సచ్చరిత్ర పారాయణ జరిపారు. రాత్రి భగవాన్ సత్యసాయిబాబా సేవా సమాజం సభ్యులు భజన నిర్వహించారు.

టీబీ పరీక్షలు

పెద్దాపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): టీబీ ముక్త భారత్ లో భాగంగా ఏడీబీ రోడ్డులోని అపర్ణ టైల్స్ పరిశ్రమలో పనిచేసే కార్మికులకు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. వ్యాధి లక్షణాలున్న వారి నుంచి శాంపిల్స్ తీసుకున్నారు. లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి ప్రభాకర్, వెంకటేష్, జగదీష్, సురేష్‌కుమార్, శేఖర్, రమణ తదితరులు పాల్గొన్నారు.



ఇంప్లాంటేషన్ సేవలను వివరిస్తున్న వైద్య నిపుణులు

'మెడికవర్'లో అత్యాధునిక ఇంప్లాంటేషన్ సేవలు

సామర్లకోట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): హృద్రోగులకు ప్రపంచ స్థాయి చికిత్స అందించేందుకు అత్యాధునిక కార్డియాక్ రీసింక్రొనైజేషన్ థెరపీ డిఫిబ్రిలేటర్ (సీఆర్‌టీ- డి) ఇంప్లాంటేషన్ సేవలు అందుబాటులోకి వచ్చాయని మెడికవర్ యాజమాన్యం వెల్లడించింది. ఆసుపత్రి ఆవరణలో మంగళవారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ప్రముఖ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ మాత శ్రీనివాస్ మాట్లాడుతూ సీఆర్‌టీ-డి గుండె గదుల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడానికి, గుండె పంపింగ్ సామర్థ్యాన్ని పెంచడానికి దోహదపడుతుందన్నారు. మరో నిపుణుడు కూరాకుల నరేష్ మాట్లాడుతూ సీఆర్‌టీ-డి గుండె అలసట, శ్వాస ఆడకపోవడం, వ్యాయామ అసహనం వంటి గుండె వైఫల్య లక్షణాలను మెరుగుపరుస్తుందన్నారు. సెంటర్ హెడ్ శుభాకరరావు మాట్లాడుతూ గుండె వ్యాధి ఉన్న ఇద్దరు సీఆర్‌టీ-డి సేవలను వినియోగించుకుని జీవితాన్ని సంతోషంగా గడుపుతున్నారని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప

నియోజకవర్గ అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

పెద్దాపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. మంగళవారం ఆయన ఆర్డీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించి ప్రభుత్వానికి, నియోజకవర్గానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. ముఖ్యంగా మౌలిక అవసరాలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం పలు విషయాలపై చర్చించారు. ఆర్డీవో శ్రీరమణి, తహసీల్దారు వెంకటలక్ష్మి, ఎంపీడీవో శ్రీలలిత, మున్సిపల్ కమిషనరు కె.శ్రీకాంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ ఏడీ దైవకుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు

సామర్లకోట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా మండలంలోని నవర గ్రామంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. పార్టీ పరిశీలకుడు బోళ్ల వెంకటరమణ, నేతలు నిమ్మకాయల రంగనాగ్, పాలకుర్తి శ్రీనుబాబు, తోటకూర శ్రీనివాసు, ఆకునూరి సత్తిబాబు, చీకట్ల వెంకటేష్, కుర్రా నారాయణస్వామి, వెన్నా పద్మనాభం (దివాణం), పెంకే వెంకటేష్, ముమ్మిడి సోమరాజు, తోట నాగబూషణం, శ్రీరాములు, వెంకన్నబాబు, జెమ్మీ, దమ్మాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు విజనరీ లీడర్ అని టీడీపీ కాకినాడ రూరల్ కో-కో-ఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ) అన్నారు. కాకినాడ రూరల్ మండలం పండూరులో మంగళవారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి ఏడాదిలో కూటమి ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలు అందించారు. ఎస్సీ గౌడ కార్పొరేషన్ల డైరెక్టర్లు కొల్లాబత్తుల అప్పారావు, మట్టా ప్రకాశ్‌గౌడ్, టీడీపీ నాయకులు రాందేవు సీతయ్యదొర, దేవు వెంకన్న, బావిశెట్టి ప్రసాద్, భీమాబత్తుల సత్యనారాయణ, ఏటుకూరి నాగమణి పాల్గొన్నారు.

పెదపూడి (కరప) (ఆంధ్రజ్యోతి): పెదపూడి మండలం దోమాడలో టీడీపీ అనపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి కూటమి నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి కూటమి ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాలను వివరిస్తూ కరపత్రాలను పంచారు. పెదపూడి మండల, దోమాడ గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.మల్లవరంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గుత్తుల వెంకటరమణ ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' వేశారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, వాడ్రేవు వీరబాబు, ధూళిపూడి వెంకటరమణ, కట్టా త్రిమూర్తులు, వుంగరాల వెంకటేశ్వరరావు, మందాల గంగ సూర్యనారాయణ, సర్పంచ్ పంపన రామకృష్ణ, పితాని విష్ణు, పిల్లి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ సిటీ (ఆంధ్రజ్యోతి): సుపరిపాలన తొలి అడుగులో భాగంగా 26, 32 డివిజన్లలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఇంటింటికీ వెళ్లి ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ నగర నాయకులు ఎస్‌కే రహీమ్, పలివెల రవిఅనంతకుమార్, పంతాడి రాజు, డివిజన్ నాయకులు రిక్కా లక్ష్మి, సంగాని నాగూర్, ఎండీ అన్సర్, సీరను రమణారెడ్డి, ఎండీ కరీముల్లా, తటరెడ్డి, చల్లా వెంకటరమణ, మేడిద విజయలక్ష్మి, ఓలేటి సీత తదితరులు పాల్గొన్నారు.

అక్నూలో యూపీఎస్సీపై అవగాహన

సర్పవరం జంక్షన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ తిమ్మాపురం అక్నూఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో మంగళవారం ప్లేస్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ మాణిక్యేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పీజీ విద్యార్థులకు జాతీయస్థాయిలో యువత పాత్ర, సివిల్ సర్వీసెస్ ప్రాధాన్యత (యూపీఎస్సీ)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్స్ మెంటార్, ప్రిపిసే వ్యవస్థాపకులు రాజేష్ మాట్లాడుతూ ప్రతీ విషయాన్ని అవగాహన చేసుకుని సబ్జెక్టుపై పూర్తి పట్టు సాధించాలన్నారు. ఈ సందర్భంగా పలు విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ స్టీఫెన్ జోషెఫ్,డాక్టర్ హరిబాబు, డాక్టర్ నానిబాబు, డాక్టర్ గోపి, డాక్టర్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్ జయంతి

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 8 (ఆంధ్రజ్యోతి): వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా బాలాజీచెరువు సెంటర్లోని ఆయన కాంస్య విగ్రహానికి వైసీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా, కాకినాడ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి రాగిరెడ్డి చంద్రకళాదీప్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసీపీ జిల్లా యువజన విభాగం, రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డి.కన్వెన్షన్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సాంబమూర్తినగర్‌లోని మహర్షి బులుసు సాంబమూర్తి పాఠశాల ఆవరణలో విద్యార్థులకు, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద భోజన వితరణ చేశారు. కార్యక్రమంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు రాగిరెడ్డి బన్నీ, జిల్లా అధికార ప్రతినిధి సుంకర విద్యాసాగర్, మహిళా విభాగం నగర అధ్యక్షురాలు పసుపులేటి వెంకటలక్ష్మి, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి తోట రాంజీ, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): దివంగత సీఎం రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా మునిసిపల్ కార్యాలయం వద్ద గల ఆయన విగ్రహానికి కాకినాడ మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాయవరం రోడ్డు, మండలంలోని చేబ్రోలులో దివంగత సీఎం రాజశేఖరరెడ్డి విగ్రహాలకు వైసీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చేబ్రోలులో జరిగిన కార్యక్రమంలో గొల్లప్రోలు జడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు, ఎంపీటీసీలు తుమ్మలపల్లి ఈశ్వరరావు, ఇసరపు రామకృష్ణ, కర్రి రాంబాబు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఎమ్మార్పీఎస్ బైక్ ర్యాలీ

కాకినాడ సిటీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం, 'పద్మశ్రీ' మంద కృష్ణ మాదిగ 60వ జన్మదినాన్ని పురస్కరించుకుని నగరంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యాన తీన్‌మార్ డప్పులు, బాణసంచా కాల్పులతో బైక్ ర్యాలీ నిర్వహించారు. గోలీలపేట రామాలయం వద్ద ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి మంద కృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేసి భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. అతిథులుగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా ఇన్‌చార్జి సూరిపాక వాసుదేవరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి, జిల్లా కో-ఇన్‌చార్జి పసుపులేటి చినబాబు, మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వల్లూరి సత్తిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ పలివెల నవీన్ ప్రసంగించారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు డోకుబుర్ర భద్రం మాస్టారు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లూరి రాజా, పువ్వల బాస్కరరావు, మిరియాల వీరబాబు, మోటుకూరి వరలక్ష్మి, ఏడిద ప్రసాద్, చెందాడ చిన్న, మిరియాల రాజు, మోటుకూరి విజయ్‌కుమార్, దూలపల్లి కృష్ణ, ఏడిద దేవి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న నాయకులు



రేపు మెగా పేరెంట్స్ సమావేశం నిర్వహించాలి

ప్రత్తిపాడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలో సమీక్షా సమావేశంలో బీసీ కార్పొరేషన్ ఈడీ, నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం అన్నిప్రభుత్వ,ప్రైవేట్, పాఠశాలలు, కళాశాలలో ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్‌తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబులు మాట్లాడుతూ 10న విద్యాసంస్థలో టైం టు టైం తల్లిదండ్రుల సమావేశాలు విజయవంతం చేయాలని కోరారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి

చింతూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని ఎస్టీ, బీసీ కాలనీ వాసులు ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవిని కోరారు. మంగళవారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే చింతూరు ఎస్టీ, బీసీ కాలనీలో పర్యటించారు. ముందుగా ఎస్టీ కాలనీలోని ముత్యాలమ్మ వృక్షంవద్ద సంప్రదాయ పూజ నిర్వహించారు. కార్యక్రమంలో చింతూరు మండల శాఖ అధ్యక్షుడు ఇల్లా చిన్నారెడ్డి, నాయకులు జమాల్ ఖాన్, ఎండి జహంగీర్, ఆసిఫ్, తమ్మయ్య, సురేష్ చౌదరి, నర్సింహ రావు, శంకర్, శ్రీరాంరెడ్డి, బాలకృష్ణ, సత్యవతి, అచ్చమ్మ పాల్గొన్నారు.

మధు కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



చింతూరు టీడీపీ సీనియర్ నాయకుడు తివారి మధుసూధనరావు కుటుంబాన్ని ఎమ్మెల్యే శిరీష దేవి పరామర్శించారు. మంగళవారం చింతూరు పర్యటనలో ఎమ్మెల్యే మధుసూధనరావు ఇంటికి వెళ్లారు. ఇటీవల మధుసూధనరావు మృతి చెందా రు. విషయం నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే మధు ఇంటికి వెళ్లి ఆ యన భార్య, పిల్లలతో మాట్లాడారు. వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

వరద బాధితులను ఆదుకుంటాం: ఎమ్మెల్యే శిరీషదేవి

వీర్‌పురం, జూలై 8(ఆంధ్రజ్యోతి) వరద బాధితులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే మిర్యాల శిరీషాదేవి అన్నారు. మంగళవారం ఆమె సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా వీఆర్‌పురంలో పర్యటించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సంవత్సరకాలంగా టీడీపీ ప్రభుత్వం చేసి న అభివృద్ధి, పేదలకు అందించిన ప్రభుత్వ పథకాలను వివరించారు. పుట్టుకతోనే వికలాంగురాలై మంచానికే పరిమతమైన ముత్యాల శంకర్‌రావు దంప తుల కుమార్తె కుటుంబాన్ని పరామర్శించారు.

రైతులు అర్థికాభివృద్ధికి చర్యలు

రంపచోడవరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులు అర్థికాభివృద్ధికి చర్యలు చేపట్టామని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ప్రైమరీ సెక్టార్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పీవో మాట్లాడుతూ ఏడు మండలాల్లో గిరిజన రైతులకు 90 శాతం రాయితీతో 550 కింటాళ్ల వరి విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఏజెన్సీలో రైతుల భూములలో మట్టి నమూనాలు సేకరించి టెస్టులు చేయాలన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరక్టర్ షరీఫ్, అసిస్టెంట్ డైరక్టర్ గణేష్, ఏడీఏలు సీహెచ్‌కేవీ చౌదరి, కె.సావిత్రి, అన్ని మండలాల వ్యవసాయ, పశుసంవర్ధకశాఖాధికారులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ మండల కమిటీల ఎంపికలపై సమావేశం

రంపచోడవరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నూతన మండల కమిటీల ఎంపికపై పార్టీ నాయకులు, కార్యకర్తలతో బుధవారం స్థానిక ఆర్‌పీ ఫంక్షన్ హాల్‌లో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి తెలిపారు. సమావేశానికి నియోజకవర్గ పరిశీలకులు కొల్లిబోయిన శ్రీనివాస్‌యాదవ్, కొత్త వెంకటేశ్వర రావు, ముడి నారాయణస్వామి, గొంది నాగేశ్వరరావు, హెచ్ ప్రశాంత్‌కుమార్, సూర్య ప్రకాష్‌రావు, సుభాష్‌చంద్రబోష్, అప్పారావు, రామలింగేశ్వరరావు, మాణిక్యాలరావు, సంజీవులు, మురళీకృష్ణ హాజరవుతారన్నారు. 11 మండలాల నాయకులు, కార్యకర్తలు అధికా సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పండ్ల మొక్కల ఆదాయంతో రైతులు ఆర్థికంగా ఎదగాలి

మోతుగూడెం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండ లం చదలవాడ పంచాయతీలోని ఎర్రగొండపాకల గ్రామంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఎంపీపీ సవలం అమలప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవోవో శ్రీనివాస్ దొర, ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు తమ పొలాల్లో పండ్ల మొక్కలు నాటుకుని ఆర్థికంగా బలపడాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తిరుపతిరావు, ఏపీవో శ్యాం రాజు, రైతులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో.. ఇంటివద్దకే రేషన్ అందించాలి

మారేడుమిల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో ఇంటివద్దకే రేషన్ సరుకులను అందించాలని జెట్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీబాబు ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వంలో ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందించేవారని ఇటీవల కూటమి ప్రభుత్వం దానిని రద్దు చేసి రేషన్ డిపోల వద్దే సరుకులను అందిస్తున్నారని అన్నారు. మైదాన ప్రాంతా లకు భిన్నంగా ఏజెన్సీ గ్రామాల పరిస్థితి ఉంటుందని ఒక్కో గ్రామం నుంచి రేషన్‌డిపోకి చేరుకోవాలంటే అనేక కిలోమీట ర్లు కాలినడకనే వచ్చి సరుకులను తీసుకువెళ్లాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. వర్షాకాలంలో అయితే పరిస్థితి మరింత దయనీయంగా ఉంటుందని అన్నారు. రహదారి, రవాణా సౌకర్యం లేక గిరిజనులు రేషన్ సరుకులను పొందలేని పరిస్థితి ఉందన్నారు.

రహదారిపై కూలిన భారీ వృక్షం

మోతుగూడెం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెం- చింతూరు మార్గంలో గోపాలపురం వద్ద మంగళవారం ఉదయం రహదారికి అడ్డంగా భారీ వృక్షం కూలడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.సమాచారం తెలుసుకున్న చింతూరు సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ సాధిక్, సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని చెట్టును కోసి అడ్డు తొలగించారు.దీంతో వాహనాల రాకపోకలు యథావిధిగా సాగాయి.

నిర్వాసిత గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించండి

దేవీపట్నం, జూలై 8(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసిత గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ మంగళవారం పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ అధికారికి నిర్వాసితులు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టులో సర్వం కోల్పోయిన దేవీపట్నం గ్రామ నిర్వాసితులకు గోకవరం శివారు స్థలాలు కేటాయించారు. ఇప్పటికీ పూర్తిగా ఇళ్ల నిర్మించలేదన్నారు. దీంతో అద్దె ఇళ్లల్లో ఉంటున్నామన్నారు. తమకు ఇచ్చిన 120 ప్లాటుల స్థలం తొమ్మిది ఎకరాల్లో రైతు పొలం సాగు చేసుకుంటున్నాడని దీనిపై అధికారులను ఎప్పుడు అడిగిన ఏదొక సాకు చెపుతున్నారన్నారు. కొన్ని కాలనీల్లో కనీస వసతులు లేకుండా తూతూ మంత్రంగా ఇళ్ల నిర్మాణం పూ ర్తిచేశారన్నారు. కార్యక్రమంలో గేదల పెదసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

'పేరెంట్స్ మీటింగ్ పండుగలా జరపాలి'

వై.రామవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రతీ పాఠశాలలో ఈనెల 10న నిర్వహించే మెగా పేరెంట్స్ టీచర్ సమావేశాన్ని పండుగ వాతావరణంలో జరపాలని ఎంపీడీవో బాపన్న దొర ఉపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం ప్రధానోపాధ్యాయులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పేరెంట్స్ మీటింగ్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు.

ఘనంగా వైఎస్ఆర్ జయంతి

ఎటపాక, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత వైఎస్ఆర్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మంత్రిప్రగడ నర్సింహారావు, బేబీ,సత్యప్రసాద్, చిన్న నాగయ్య, ఆకుల దయాకర్ పాల్గొన్నారు.

కూనవరం: కూనవరంలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి వైసీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ పాయం రంగమ్మ, జడ్పీటీసీ గుజ్జా విజయ, కొమ్మాని మోహనరావు, భరతమూర్తి పాల్గొన్నారు.

చింతూరు:వైసీపీ మండలశాఖ అధ్యక్షుడు వై.రామలింగారెడ్డి ఆధ్వర్యంలో దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జయ ంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ సవలం అమల, ఉప ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, ఎంపీటీసీ సున్నం నాగరాజు, కోఆప్షన్ సభ్యుడు జి.క్రియా సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మోతుగూడెం: మోతుగూడెం పంచాయతీ పొల్లూరు గ్రామంలో దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామసర్పంచ్ ఆకేటిసీత, పీఆర్‌పురం మండల నాయకులుముత్యాల శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

బంగారు కుటుంబాలకు రెండు నెలల్లో చేయూత

● ప్రత్తిపాడులో కలెక్టర్ షాన్‌మోహన్

ప్రత్తిపాడు, జూలై 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బంగారు కుటుంబాలకు రెండునెలల్లో చేయూతనందిస్తామని కలెక్టర్ షన్‌మోహన్‌షగిలి చెప్పారు. ప్రత్తిపాడులోని ఇందిరాకాలనీలో మంగళవారం కలెక్టర్ పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పీ4 పథకం ద్వారా గుర్తించిన మాదే రమణ కుటుంబాన్ని కలెక్టర్ కలిశారు. నేరుగా ఇందిరాకాలనీలోని మాదే కుటుంబం ఇంటిలోకి కలెక్టర్ అధికారులతో తరలివెళ్లారు. మాదే రమణ, విజయకుమారి దంపతులతోపాటు కుమారుడు దాసు, కుమార్తె ఝాన్సీరాణిలతో కలెక్టర్ మాట్లాడారు. వారి జీవన విధానం, స్థితి గతులపై ఆరా తీశారు. ఈసందర్భంగా కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలను ఆదుకుని పేదరికాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా పీ4 కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు,, తహసీల్దార్ సూర్యప్రభ, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవో కాశీవిశ్వనాథ్, పంచాయతీ కార్యదర్శి జ్యోతుల పద్మరాజులు ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు పాల్గొన్నారు.



కాత్రావులపల్లిలో నాగదుర్గ పిల్లలతో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

కాత్రావులపల్లిలో దత్తత కుటుంబంతో కలెక్టర్ మాటామంతి

జగ్గంపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పీ4 కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ఒక బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకోవాలని ప్రణాళికతో ముందుకు వెళుతుంది. దీనిలో భాగంగా జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ షగిలి కాత్రావులపల్లిలోని శాంతానాగ దుర్గ కుటుంబాన్ని కలిశారు. నాగదుర్గ భర్త సాంబశివరావు సంవత్సర క్రితం మరణించాడు. భర్త మరణంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులను దుర్గమ్మ ఎదుర్కొంటుంది. నాగదుర్గకు ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. ఒకరు తొమ్మిదో తరగతి, మరొకరు ఐదో తరగతి పిఠాపురం మండలం కందరాడ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. నాగదుర్గ కు సొంతి ల్లు లేకపోవడంతో కాత్రాళ్లపల్లిలోనే మామ ఇంటి వద్ద ఉంటూ జీవన సాగిస్తోంది. జిల్లా కలెక్టర్ నాగదుర్గ నుంచి వివరాలు తెలుసుకున్నారు. పిల్లల ను చదివించుకునేందుకు ఏ ఉపాధి కల్పిస్తే మీరు ముందుకు వెళ్తారని నాగదుర్గను కలె క్టర్ అడుగగా ప్రస్తుతానికి నేనేమీ చేయలేనని ఆమె బదులిచ్చింది. నెల సమయం ఇస్తున్నామని ఈలోపు ఆలోచించి మాకు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. నాగదుర్గకు ఇల్లు లేకపోవడంతో ఇంటి స్థలం ఇల్లు నిర్మించేందుకు ఏర్పాటు చేస్తామని వివరించారు. భర్త చనిపోయి సంవత్సరం అవుతున్న ఆమెకు పెన్షన్ మంజూరు కాకపోవడంతో అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పెద్దాపురం ఆర్డీవో కె.శ్రీరమణి, జిల్లా ప్రణాళిక అధికారి పి.త్రినాథ్, జగ్గంపేట ఎమ్మార్వో జేవీయర్ రమేష్, ఎంపీడీవో ఏవీఎస్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.







వేలంకలో ఎమ్మెల్యే నెహ్రూకు స్వాగతం పలుకుతున్న మహిళలు, యుజేపురంలో ఇంటింటికీ కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ, పి.వెంకటాపురం గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివ్య

అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

● ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

కిర్లంపూడి, జూలై 8(ఆంధ్రజ్యోతి):జగ్గంపేట నియోజకవర్గంలో రూ.80కోట్లతో రోడ్లు అభివృద్ధి చేశామని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. వేలంక గ్రామంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు గండే కాశీవిశ్వనాథ్ ఆధ్వర్యంలో జరిగిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. వేలంక గ్రామానికి ప్రధాన రహదారికి రూ.1.40కోట్లు నిధులు మంజూరు చేశామని, త్వరలోనే ప్రారంబిస్తారన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, చదరం చంటిబాబు, సర్పంచ్ రాయుడు బాబురావు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కుర్ల చినబాబు, జిల్లా టీడీపీ నాయకులు తూము కుమార్, కాళ్ల వెంకటేష్, బొదిరెడ్ల సుబ్బారావు, ఇంటి చల్లబాబు, బేతాళ బాబ్జి, గండే రామలక్ష్మణమూర్తి, సత్యనారాయణ, రాయుడు, రాజబాబు, గణేష్ ఉన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదే

ప్రత్తిపాడు: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు సమర్థవంతంగా నెరవేర్చిన ఘనత టీడీపీదేనని ఎమ్మెల్యే సత్యప్రభ తెలిపారు. సుపరిపాలనలోని తొలి అడుగు కార్యక్రమం మం డలంలోని యుజేపురం గ్రామంలో మంగళవారం సాయంత్రం పర్యటించారు. సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ఎమ్మెల్యే గ్రామస్తులకు వివరించారు. ఎమ్మెల్యేకు గ్రామపెద్దలు వట్టుకూళ్ళ కృష్ణ, కృష్ణ సత్యనారాయణ తదితరులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మీసాల రాజు, నియోజకవర్గ సీనియర్ టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, ఇళ్ళ అప్పారా వు, తటవర్తి సుబ్బారావు, అమరాది వెంకట్రావు, బద్ది రామారావు, దాకారపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

ఏలేశ్వరం: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తోందని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. మంగళవారం మండలంలోని లింగంపర్తి గ్రామంలో సుపరిపాలన కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. మండలంలోని లింగంపర్తి, భద్రవరం, సిరిపురం గ్రామాల్లో మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంద్వారా సమకూర్చిన కొబ్బరి, మామిడి మొక్కలను ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, ఎంపీడీవో సూర్యనారాయణ మొక్కలు నాటారు. జ్యోతుల పెదబాబు, సూతి బూర య్య, చిక్కాల లక్ష్మణరావు, నూకటి ఈశ్వరరావు పాల్గొన్నారు.

గండేపల్లి: గండేపల్లిలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలన సుపరిపాలన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. అభివృద్ధి వివరాల కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొల్లంరెడ్డి రామకృష్ణ, పైల వెంకన్న, పెనుగాడి నాగరాజు, ఉండవిల్లి రాధాకృష్ణ, పట్టాభిరామయ్య, గరికపాటి రమణ, నాను శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి సంక్షేమం టీడీపీతోనే సాధ్యం

తునిరూరల్: అభివృద్ధి సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని ప్రభుత్వ విప్, యనమల దివ్య తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా తుని మండలం తిమ్మాపురం, టి.వెంకటాపురం గ్రామాల్లో ఆమె పర్యటించి ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలుపై ఆరాతీసి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గజ్జి రాంబాబు, పప్పు నవీన్, మంగంబుజ్జి, తాత గోవిందు, ఆవాల నాని, బంధం బాబురావు, అక్కి అచ్యుతరావు, అబ్బులు, ఉన్నారు.

జగ్గంపేట: జగ్గంపేట పద్మనాభ నగర్‌లో మంగళవారం సాయంత్రం టీడీపీ నాయకులు కూటమి తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వేముల జోగారావు, నంద్యాల చిరంజీవి, పాండ్రంగి రాంబాబు, మారిశెట్టి భద్రం, కోరుమల్ల శ్రీను, బోరా సత్తిబాబు, కోరాడ బాబురావు, జనపరెడ్డి వీరబాబు, రాయి సాయి, గళ్ళ అయ్యప్పవీరబాబు కూటమి నాయకులు పాల్గొన్నారు.

మెగా పీటీఎంను విజయవంతం చేయాలి

తొండంగి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల పదిన నిర్వహించే మెగా పీటీఎంను విద్యార్థుల తల్లిదండ్రులు విజయవంతం చేయాలని ఎంఈవో షేక్ బాబ్జి తెలిపారు. అన్ని పాఠశాలల్లో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. విద్యార్థుల ప్రగతి, ప్రవర్తన, హాజరు తదితర అన్ని అంశాలు తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరిస్తారన్నారు. పండగ వాతావరణంలో జరిగే మెగా పీటీఎంలో గ్రామ పెద్దలు దాతలు, పూర్వ విద్యార్థులు పాల్గొని విజయ వంతం చేయాలన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం చేయండి

జగ్గంపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవింద పురం గ్రామంలో అఖిలభారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం, ఆదివాసీ సంఘం సీపీఐ ఎంఎల్ లిబరేషన్, పిలుపునిచ్చారు. జూలై 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని జిల్లా సీపీఐ ఎంఎల్ లిబరేషన్ కార్యవర్గ సభ్యుడు జక్కంపూడి రాజు ప్రచారం నిర్వహించారు.

సొంత నిధులతో రహదారి మరమ్మతులు

జగ్గంపేట, జూలై 8(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా జగ్గంపేట మండలం కాత్రావులపల్లి గ్రామ టీడీపీ అధ్యక్షుడు ముసిరెడ్డి నాగేశ్వరరావు తన సొంత డబ్బులతో లక్ష రూపాయలు వెచ్చించి రోడ్డు మరమ్మతులు చేపట్టారు. ఇటీవల పడ్డ వర్షాల కారణంగా కాత్రావులపల్లి పెట్రోల్ బంక్ వద్ద నుంచి హైస్కూల్ వరకు సుమారు కిలోమీటర్‌పైగా గోతులతో బురదమయంగా మారడంతో గ్రామ ప్రజల వాహనదారుల సమస్యలు దృష్టిలో పెట్టుకొని ముసిరెడ్డి నాగేశ్వరరావు సేవాభావంతో సుమారు లక్ష రూపాయలు నిధులు వెచ్చించి మెటల్ వేయించి యంత్రాలతో రోడ్డుపై గోతులను పూడ్చేందుకు పనులు చేపట్టారు.

మొక్కలు నాటిద్దాం... పర్యావరణాన్ని రక్షించుకుందాం

రౌతులపూడి, జూలై(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని డీఎల్‌పీవో బాలామణి అన్నారు. మంగళవారం గుమ్మరేగుల గ్రామంలో పర్యటించారు. తడిపొడి చెత్త గురించి ప్రజలకు వివరించారు. అనంతరం మొక్కను నాటారు. ఆమె వెంట టీడీపీ నేత పసగడుగుల రమణ, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్ రోడ్డు పనుల పరిశీలన



ఆసుపత్రికి వెళ్లే రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

గండేపల్లి, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని జడ్.రాగంపేట గ్రామ ంలో ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంట ర్ 30 పడకల ఆసుపత్రికి వెళ్లే రోడ్డుకు జాతీయరహదారి నుంచి ఆరోగ్య కేంద్రం వరకు రూ. 60లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సిమెంటు రోడ్డు పనులను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ ఆసుపత్రిలో సర్వహంగులతో నిర్మించామని జాతీయరహదారి నుంచి ఆసుపత్రికి వెళ్లే రోడ్డు యుద్ధప్రాతిపదికన రూ.60లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు, కందుల చిట్టిబాబు, అడబాల భాస్కరరావు, మారిశెట్టి భద్రం, జాస్తి వసంత్, బొల్లంరెడ్డి రామకృష్ణ, కొత్తకొండ బాబు, యర్రంశెట్టి బాబ్జి, అడబాల ఆంజనేయులు, దాపర్తి సీతారామయ్య, కందుల కొండయ్యచౌదరి, వీరవెంకటచౌదరి, కంటే సురేంద్ర, డీఈ ఉమాశంకర్, జేఈ నారాయణమూర్తి, డాక్టర్ ప్రణీత్ పాల్గొన్నారు.

1200 ఎకరాలకు సాగునీరు విడుదల

కిర్లంపూడి, జూలై8(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమవరం గ్రామంలో 1200 ఎకరాల రైతుల భూములకు సాగు, తాగునీటికి నీరు విడుదల చేస్తామని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. సోమవరం నీటిసంఘం అధ్యక్షుడు జ్యోతుల కోటి అధ్యక్షతన సోమవరం పంపింగ్ స్కీమ్‌వద్ద మంగళవారం ఆయకట్టుకు నీరు విడుదల చేశారు. ఎత్తిపోతల పథకం ద్వారా ఈ నీరు విడుదల చేస్తామన్నారు. అలాగే డీఈ దుర్గాగురవయ్యను పంపి ంగ్ స్కీమ్ నిర్వహణ కోసం అంచనాలు తయారుచేసి ఇవ్వాలని ఆదేశించడంతో సుమారు రూ.8కోట్లతో పది సంవత్సరాలపాటు నిర్వహణ ఏర్పాటుచేసే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, జంప న సీతారామచంద్రవర్మ, టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు, మంచికంటి శ్రీను, గంగిరెడ్ల దొరబాబు, రవి వర్మ, అర్లంపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సోమవరంలో ఎమ్మెల్యే నెహ్రూ, కిర్లంపూడిలో ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, సర్పంచ్ గుడాల శ్రీలత రాంబాబు, టీడీపీ అధ్యక్షుడు చదరం చంటిబాబు, కాళ్ల వెంకటేష్, ఆళ్ల బాబు, ఎంపీడీవో హరికృష్ణ మొక్కలు నాటారు.



ప్రత్తిపాడులో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ముద్రగడ

రక్తదానంతో ప్రాణదానం : మాజీ మంత్రి ముద్రగడ

ప్రత్తిపాడు, జూలై 8(ఆంధ్రజ్యోతి):రక్తదానం ప్రాణదానంతో సమానమని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం తెలిపారు. ప్రత్తిపాడు లయన్స్ కమ్యూనిటీ హాల్లో మంగళవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా వైసీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని పద్మనాభం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంపిణీ చేశారు. ప్రత్తిపాడు సర్పంచ్ గుడాల విజయలక్ష్మి వెంకటరత్నం, జడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి దొరబాబు, ఎంపీపీ గోళ్ళకాంతి సుధాకర్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గొల్లపల్లి కాశీవిశ్వనాథ్, దళే చిట్టిబాబు,పాల్గొన్నారు.

తునిరూరల్: తుని పట్నం మాజీ మంత్రి, కాకినాడజిల్లా వైసీపీ అధ్యక్షుడు దాడిశెట్టి రాజా ఆధ్వర్యంలో తునిలో వైఎస్ఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. మాజీమంత్రి రామాథియేటర్ సెంటర్‌లో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వైసీపీ నాయకులు యనమల కృష్ణుడు, ర్యాలిం గి రమణాగౌడ్, చకురు నాగేంద్ర నెహ్రూ, చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు ఉన్నారు.

కిర్లంపూడి: మండలంలో పాలెం గ్రామంలో వైఎస్సార్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. జగ్గంపేట నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి, మాజీమంత్రి తోట నరసింహం హాజరై వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అడబాల సుబ్బారాయుడు, తోట అయ్యన్న, ఆడారి రాజబాబు, రాపేటి శ్రీనివాసరావు, ఓలేటి రాజేశ్వరరావు, సాయిరాం ఉన్నారు.

జగ్గంపేట: ఘనంగా దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని జగ్గంపేటలోని మంగళవారం ఘనంగా నిర్వహించారు నియోజకవర్గం వైసీపీ ఇంచార్జ్ తోట నరసింహం ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం సెంటర్లో ఉన్న వైయస్సార్ విగ్రహం వద్ద భారీ కేకును కట్టేశారు. కార్యక్రమంలో జగ్గంపేట మండలం అధ్యక్షుడు రావుల గణేష్‌రాజా, టౌన్ అధ్యక్షుడు కాపవరపు ప్రసాద్, కరుటూరి వీర్రాజు, రాజబాబు పాల్గొన్నారు.

జగ్గంపేట: పేద ప్రజల గుండెల్లో దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి స్థానం సుస్థిరం అని పార్టీ సీనియర్‌నేత, జిల్లా బూత్‌కమిటీల అధ్యక్షుడు ఒమ్మి రఘురామ్ అన్నారు. జడ్పీటీసీ ఒమ్మి బిందుమాధవి ఆధ్వర్యంలో వైఎస్ జయంతిని నిర్వహించారు.

రౌతులపూడి : రౌతులపూడి గ్రామంలో మండల వైసీపీ కన్వీనర్ చింతకాయల సత్య నారాయణ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు. ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు.. వైసీపీ యువనేత వాసిరెడ్డి జేమీలు, జడ్పీటీసీ గొల్లు దివాణం, వాసిరెడ్డి భాస్కర్ బాబు, సర్పంచ్ సర్లం శ్రీను, సుర్ల సత్తిబాబు, నాగేశ్వరరావు, తాతాజీ, జ్యోతిబాబు పాల్గొన్నారు.

ఎన్‌పీటీఈఎల్ పరీక్షల్లో ఆదిత్యకి అఖిలభారత స్థాయిలో ఏ గ్రేడ్

గండేపల్లి, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీ ఎన్‌పీటీఈఎల్ పరీక్షల్లో విశేష ప్రతిభను చూపడంతో ఏ గ్రేడ్ సాధించిందని యూనివర్శిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎన్‌పీటీఈఎల్ నిర్వహించిన ఆన్‌లైన్ కోర్సుల్లో విద్యార్థులు చూపించిన ప్రతిభ ఆధారంగా ఆదిత్య యూనివర్శిటీకి అఖిలభారత స్థాయిలో ఏ గ్రేడ్, 7200 కాలేజీల్లో 189వ స్థానం సాధించినట్లు తెలిపారు. ఎన్‌పీటీ ఈఎల్ లోకల్ చాప్టర్ కోఆర్డినేటర్ చీఫ్ లైబ్రేరియన్ కె.అశోక్ కుమార్ మాట్లాడుతూ అఖిలభారతస్థాయిలో 17మంది ఆదిత్య విద్యార్థులు టాపర్స్‌గా నిలిచారనిర, వారికి దేశంలోని వివిధ ఐఐటీల్లో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌పీటీఈఎల్ పరీక్షల్లో ఎ గ్రేడ్ సాధించడంపట్ల ప్రో ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి, డిప్యూటీ ప్రోఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి అన్నారు.

ఇర్రిపాక శివాలయాన్ని సందర్శించిన శ్రీనివాసానంద సరస్వతి

జగ్గంపేటరూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఇర్రిపాక ఏలేరునది వద్ద ఏర్పాటుచేసిన కోటి శివలింగాల ఆలయాన్ని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి సందర్శించారు. ఆయన బృందానికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ స్వాగతం పలికారు. ఆలయ విశిష్టతను, ఆలయంలో ఏర్పాటుచేసిన శివ లింగాలను, వేంకటేశ్వరస్వామి దేవాలయం ఆలయ చరిత్రను శ్రీనివాసా సరస్వతికి ఎమ్మెల్యేజ్యోతుల నెహ్రూ వివరించారు. శ్రీనివాసానంద సరస్వతి మాట్లాడుతూ పూర్వజన్మ సుకృతం ఉంటే తప్ప ఇలాంటి దేవాలయాన్ని నిర్మించడం సాధ్యంకాదన్నారు. చికాగోలో స్వామి వివేకానంద మాట్లాడిన మాటలు గుర్తుకు వస్తున్నాయన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీనివాసానంద సరస్వతిలాంటి ఆధ్యాత్మిక గురువులు ఇర్రిపాక గ్రామాన్ని సందర్శించడం సంతోషదాయకమన్నారు. పరమేశ్వరుడు వెంకటేశ్వరస్వామి ఆశీస్సులతో జ్యోతిర్లింగ క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. పోతుల మోహనరావు, తోటరవి, బుజ్జి పాల్గొన్నారు

జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్‌కు రూ.2 లక్షల విరాళం

జగ్గంపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక రావులమ్మనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్‌కు రూ.2లక్షలు చెక్కును భూపాలపట్నం ప్రసాద్ కుమారుడు వెంకటరాకేష్ అందించారు. ఈ సందర్భంగా వెంకట రాజేష్ మాట్లాడుతూ చార్టెడ్ అకంటెంట్‌గా ఉద్యోగం సాధించిన నేపథ్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్‌కు రూ.2లక్షల విరాళం అందిస్తున్నానన్నారు. కార్యక్రమంలో వీరా రెడ్డి కాశిబాబు, తోట రవి, తోట గాంధీ, భూపాలపట్నం ప్రసాద్, ప్రియతమ్ తేజ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రత్తిపాడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి):ఖరీఫ్ సీజన్‌లో సబ్సిడీ ధరలపై ప్రభుత్వం సరఫరా చేస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. మండలంలోని ఉద్దండ జగన్నాధపురం గ్రామంలో సబ్సిడీ ధరలపై మంజూరైన విత్తనాలను రైతులకు ఆమె పంపిణీ చేశారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా మంజూరైన మామిడి, ఇతర జాతుల మొక్కలను రాచపల్లిలో కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే నాటారు. వరి విత్తనాలు సబ్సిడీపై అందజేశారు. జగ్గంపేట ఏడీఏ శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి జోకా అమృత పాల్గొన్నారు.

పి.నాయకంపల్లిలో పొలం పిలుస్తోంది

గండేపల్లి, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.నాయంకపల్లిలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో ఆర్.శ్రీరామ్ హాజరై మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం ఇచ్చే అన్నదాత సుఖీభవ పథకం ఈనెల 18న వేస్తామన్నారు. ఈనెల 13వ తేదీ లోపు ఏమైనా గ్రీవెన్స్ ఉంటే రైతు సేవా కేంద్రంలో సంప్రదించి నమోదు చేసుకోవాలన్నారు. నో డేటా ఫౌండ్ అని వస్తే భూమికి ఆధార్ లింక్ చేసుకోవాలన్నారు. పొలం గట్లపై కంది వేసుకోవడానికి రైతులకు ఉచితంగా కంది విత్తనాలు ఇస్తామన్నారు. కౌలు రైతులంతా కౌలు గుర్తింపు కార్డు చేయించుకోవాలన్నారు. పి.మౌలి, జాన్ క్రిస్టోఫర్, జి.శివ, పి.చందు ఉన్నారు.

పండ్ల మొక్కలతో రైతులకు ప్రయోజనం

తొండంగి, జూలై 8(ఆంధ్రజ్యోతి): రైతులకు పండ్ల మొక్కల ద్వారా ప్రయోజనం చేకూరుతుందని ఎంపీడీవో బి.రాజేశ్వర్రావు అన్నారు. మంగళవారం ఆయన ఒంటిమామిడి గ్రామంలో పండ్ల మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పైడికొండ, ఏ కొత్త పల్లి, పీఈ చిన్నయ్యపాలెం, కేవీ పురం గ్రామాల్లో సుమారు నాల్గు వందల మొక్కలను నాటనున్నామన్నారు. ఒంటిమామిడి సర్పంచ్ అంగులూరి సుధాకర్, ఉపాధి ఏపీఎం, స్థానిక నేతలు పాల్గొన్నారు.

జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర మహిళలకు క్షమాపణ చెప్పాలి: ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మా మహిళా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి మాట్లాడిన మాటలు చాలా అనైతికంగా ఉన్నాయంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర మహిళలకు క్షమాపణ చెప్పాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ డిమాండ్ చేశారు.. మంగళ వారం రాత్రి ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడిన మాటలు అత్యంత నీచమైనవని మండిపడ్డారు. ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డిని వ్యక్తిగతంగా కించపరుస్తూ అసభ్యపదజాలం వినియోగించడం ఒక మహిళా ఎమ్మెల్యేగా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సాటి మహిళగా మహిళలందరికీ మాజీ ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

గుట్కాలు విక్రయిస్తే కఠిన చర్యలు

శంఖవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): పాఠశాలల పరిసర ప్రాం తాలలో సిగరెట్లు, నిషేధిత గుట్కాలు, పాన్‌పరాగ్‌లు, లిక్కర్, మాదకద్రవ్యాలు వంటివి విక్రయిస్తే కఠినంగా వ్యవహరిస్తామని అన్నవరం ఎస్ఐ శ్రీహరిబాబు అన్నారు. మంగళవారం కత్తిపూడిలో పాఠశాలల సమీపంలో పాఠశాల సిబ్బందితో కలిసి చిరుదుకాణాలలో తనిఖీలు చేపట్టారు.

ప్రత్తిపాడులో ఆపరేషన్ సేఫ్ క్యాంపస్

ప్రత్తిపాడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు పోలీస్ సర్కిల్ పరిధిలో సీఐ బి.సూర్యఅప్పారావు ఆధ్వర్యంలో మంగళవారం ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎస్ఐలు ఎస్.లక్ష్మీకాంత్, హరిబా బు, ఎన్.రామలింగేశ్వరరావు, డీవీరమణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.